

వైసీపీ పాలన విరగడై ఏడాది అయిన సందర్భంగా బూరుగుపూడిలో నరకాసురుడు, తుగ్లక్ దిష్టిబొమ్మలను దహనం చేస్తున్న దృశ్యం





రాజమహేంద్రవరంలో ముగ్గుల పోటీ దృశ్యం.. దీపావళి వేడుకను తలపిస్తూ కాకరపువ్వొత్తులు కాలుస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, గన్ని కృష్ణ, జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వై శ్రీనివాస్ తదితరులు


ఉత్సాహంగా సుపరిపాలన సంబరాలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లావ్యాప్తంగా విజయోత్సవ వేడుకలు జరిపారు. ముఖ్యంగా జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపుమేరకు రాజమహేంద్రవరంలో బుధవారం రాత్రి నందం గన్నిరాజు సెంటర్‌లో సుపరిపాలన సంబరాలు నిర్వహించారు. జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వై శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూటమి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఏపీ టూరిజం డైరెక్టర్ గంటా స్వరూప, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, జనసేన అనుశ్రీ సత్యనారాయణ సతీమణి అనురాధ,

దీపావళి, సంక్రాంతిని తలపిస్తూ వేడుకలు

బీజేపీ నాయకురాలు హారిక హజరయ్యారు. తొలుత సంక్రాంతిని గుర్తుచేస్తూ మహిళలకు ముగ్గుల పోటీ, బాణసంచా కాల్చి దీపావళి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ చీకటి పాలనకు చరమగీతం పాడుతూ ప్రజలు గతేడాది 4న ఓటు అనే ఆయుధంతో భూస్థాపితం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతూ ముందుకు సాగుతోందన్నారు. జనసేన అధ్యక్షుడు వై శ్రీనివాస్ మాట్లాడుతూ తమ నేత పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు ఈ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

'సహకార' రైతులపై ఉక్కు పిడికిలి!



- నిబంధనల పేరిట వడ్డీ రేటు పెంచేలా డీసీసీబీ ప్రణాళిక
- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ దాటి రుణం పొందితే 11 శాతం వడ్డీ
- పంట రుణాలు మంజూరు చేయాలంటే ఫీల్డ్ విజిట్ తప్పనిసరి
- ఉత్తర్వులు జారీచేసిన డీసీసీబీ సీఈవో
- ఆందోళన చెందుతున్న రైతులు

వ్యవసాయ సాగులో ఇప్పటికే ఎన్నో ఇబ్బందులు పడుతున్న రైతులపై ఇప్పుడు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కూడా ఉక్కు పిడికిలి బిగించింది. నిబంధనల పేరిట వడ్డీ రేటును పెంచుతూ రైతులపై అధిక భారం మోపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తాల్లో రుణాలు పొందిన రైతుల నుంచి 7 శాతం వడ్డీకి బదులు 11శాతం వడ్డీ రేటును వసూలు చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో గతనెల 30న ఇచ్చిన సర్క్యులర్ ఇప్పుడు రైతుల్లో చర్చనీయాంశమైంది. వడ్డీ రేట్లను పెంచుతూ డీసీసీబీ ఇచ్చిన ఉత్తర్వులపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా కోట్ల రూపాయలను రుణాల రూపంలో తీసుకుని సొసైటీలను నిలువునా ముంచేయడంలో కొందరు ప్రజాప్రతినిధులు, సహకార సంఘాల నేతలు కీలక పాత్ర వహించడం వల్ల డీసీసీబీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. దీంతో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలు వర్తింపచేయడం ద్వారా 11శాతం వడ్డీని వసూలు చేయాలని డీసీసీబీ సర్క్యులర్‌ను సొసైటీలకు జారీచేసింది. అలాగే పలు నిబంధనలను అమలులోకి తేవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

(అమలాపురం - ఆంధ్రజ్యోతి)

డీసీసీబీ బ్యాంకు పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 298 సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో అత్యధికంగా కోనసీమ జిల్లాలో 166, తూర్పులో 49, కాకినాడలో 72, అల్లూరి జిల్లాలో 11 సొసైటీలున్నాయి. గతంలో పాలకుల తప్పిదాలు, స్కామ్‌ల వల్ల కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటితోపాటు జిల్లావ్యాప్తంగా ఉన్న సొసైటీల్లో కూడా రుణాల దుర్వినియోగంపై విచారణ కూడా జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో గతనెల 30న డీసీసీబీ ఒక సర్క్యులర్ జారీ చేసింది. 2025-26 సంవత్సరానికి బ్యాంకు ద్వారా సొంత భూములపై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కంటే అధికంగా పంట రుణాలు మంజూరుచేసిన రుణాల మొత్తానికి (ఏఎఎస్‌పీవో) సంబంధించి ఈ ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవానికి సొసైటీల ద్వారా వ్యవసాయదారులకు ఎంసీఎల్ పద్ధతిలో పంట రుణాలను మంజూరు చేస్తున్నారు. ఆప్కాబ్ నుంచి పంట రుణాలు మంజూరుచేసిన మొత్తానికి రాయితీ వడ్డీ రేటుకు రీఫైనాన్స్ చేయడం లేదు. కానీ బ్యాంకు ద్వారా సంఘానికి 5.75శాతం వడ్డీకి పంట రుణాలు మంజూరు చేయడంవల్ల రైతు కేవలం 7 శాతం వడ్డీరేటుకి రుణం మంజూరు చేస్తారు. సకాలంలో రుణం తిరిగి చెల్లించిన రైతులకు 3శాతం వడ్డీ రాయితీ కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. కానీ ఈ వడ్డీ రాయితీ కేంద్రం నుంచి జమకావడం లేదని సమాచారం. సొసైటీల పరిధిలో రైతులకు ఉన్న సొంత భూములై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కన్నా ఎక్కువ మొత్తంలో పంటరుణాలు మంజూరు చేశారు. సొసైటీలు కంప్యూటరీకరణ పూర్తికావడంతో ఎంసీఎల్ పద్ధతిన రుణాలు మంజూరు చేయడం వల్ల గతంలో సొంత భూమిపై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కంటే అధిక మొత్తాల్లో రుణాలు పొందినట్టు గుర్తించారు. అలా అధిక మొత్తాల్లో రుణాలు పొందిన వారికి ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రాయితీగానీ, పంటల బీమా పథకంగానీ వర్తించదు. ఈ నిబంధనలు అమలు వల్ల ఖాతాదారుల అనుమతితో అడిషనల్ ఎస్‌ఏవోగా రుణాన్ని మార్పు చేయాల్సి ఉంది. ఆప్కాబ్ నుంచి రాయితీ వడ్డీ రేట్లకు రీఫైనాన్స్ రానందున కొత్త సభ్యులకు పంట రుణాలు మంజూరు చేయాలంటే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు రుణాన్ని పెంపుదల చేయాలన్నా, ఎడిషనల్ ఎస్‌ఏవోగా సహకార సంఘాలకు 9.75 వడ్డీ రేటుకు, సంఘం ద్వారా మెంబర్లకు 11 శాతం వడ్డీరేటుకు పంట రుణాలు మంజూరు చేయాలన్నా కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది.

రుణం పొందాలంటే.. సవాలక్ష నిబంధనలు

రుణ ప్రణాళిక అమలులో కచ్చితంగా నిబంధనలు పాటించాలని కాకినాడ డీసీసీబీ బ్యాంకు సీఈవో జారీచేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. పంట రుణానికి సంబంధించి ఎడిషనల్ ఎస్‌ఏవో వడ్డీరేటు 9.75శాతం(సహకార సంఘాలకు), 11శాతం సంఘం ద్వారా సభ్యునికి పీనల్ వడ్డీ 2శాతంగా నిర్ణయించారు. రుణ కాలవ్యవధిని ఏడాదిగా నిర్ణయించారు. వయోపరిమితి 15 నుంచి 65ఏళ్లు కలిగిన రైతులు వ్యక్తిగత రుణ పరిమితిని రూ.3 లక్షలకు పరిమితం చేశారు. షేర్ ధనాన్ని రుణం మొత్తంపై 10 శాతంగా నిర్ణయించారు. ఫిషరీస్ డైరీ ప్రయోజనాలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెట్టుబడి రుణాలు మంజూరుచేయాలి. రుణాలు మంజూరు చేసేటప్పుడు రైతుల నుంచి సొంత భూమికి సంబంధించి బ్యాంకు ఎస్‌ఏవో పాలసీలో పొందుపరిచిన అన్ని ముఖ్యపత్రాలతోపాటు ఇ-క్రాప్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఖాతాదారుల మార్ట్‌గేజ్ వివరాలు, డిక్లరేషన్ బాండ్ రిజిస్టర్‌లో పొందుపరిచి భద్రపరచాలి. సొసైటీల పరిధిలో సీఈవో, సూపర్‌వైజర్, రైతు సమక్షంలో ఫీల్డ్ విజిట్ చేసి రైతు పండించే భూములు, పంటలకు సంబంధించి జీపీఎస్ ఫొటోను తీసుకుని ఏఎస్‌ఏవో ఫైలు నందు ఇతర డాక్యుమెంట్లతో భద్రపరచాలి. షాడో రిజిస్టర్ నిర్వహించాలి. కొత్త సభ్యులకు పంట రుణాలు మంజూరు చేయాలంటే జూన్ నాటికి ఆ సంఘం పరిధిలో 80శాతం పైబడి పంట రుణాలు రికవరీ ఉంటేనే కొత్తరుణాలు మంజూరు చేయాలి. ఇలా డీసీసీబీ విధించిన తాజా ఆంక్షలతో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

పెత్తనం అంతే.. పోనివ్వమంతే!

- ప్రభుత్వం మారి ఏడాదైనా కీలక పోస్టుల్లో వైసీపీ సానుకూల అధికారులదే పెత్తనం
- ఐదున్నరేళ్ల నుంచీ ఉమ్మడి, కాకినాడ జిల్లా డ్వామా పీడీగా చక్రం తిప్పుతున్న వెంకటలక్ష్మి
- ఉమ్మడి జిల్లా పీడీగా పేదల ఇళ్ల స్థలాల చదును పనుల్లో భారీగా బొక్కుడు
- రూ.550 కోట్లకుపైగా వైసీపీ నేతలకు అడ్డగోలుగా చెల్లించిన బిల్లుల్లో అక్రమాలు
- విజిలెన్స్ విచారణలో ఇటీవల పీడీ అక్రమాలు నిర్ధారణ.. అయినా చర్యలు నిల్
- ఐదున్నరేళ్ల నుంచీ పీడీ కుర్చీ దిగకుండా, బదిలీయే లేకుండా మళ్లీ పావులు
- అటు ఐదేళ్లు వంగా గీత పీఏగా పనిచేసిన రామ్మోహన్ కలెక్టరేట్ ఏవోగా అక్రమాలు
- నోడల్ జిల్లా ఏవో హోదాలో ఉమ్మడి జిల్లాలో ఉద్యోగులకు ఏజెన్సీ బదిలీల పేరుతో పైరవీలు
- ఉద్యోగులపై కలెక్టర్లు చర్యలు ఉపసంహరించిన కేసుల్లో లక్షల్లో గుంజుడు
- కలెక్టరేట్‌లో ఏ కీలక ఫైలు కదిలినా ఇప్పటికీ వైసీపీ నేతలకు తక్షణమే ఫోన్లు
- పౌర సరఫరాల సంస్థలో అక్రమాలపై విజిలెన్స్ బాధ్యుడిగా చేసినా చర్యలు నిల్



వెంకటలక్ష్మి



రామ్మోహన్

వారిద్దరు కీలక ప్రభుత్వ ఉద్యోగులు.. అంతకుమించి కీలకమైన ఉద్యోగ బాధ్యతల్లో ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వీరు తమ హోదాలను అడ్డంపెట్టుకుని చెలరేగిపోయారు. వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేల అక్రమాలకు అడ్డగోలుగా సహకరించారు. అదే సమయంలో వీరూ తలాకొంత నొక్కేశారు.. అయితే ప్రభుత్వం మారిన తర్వాత వీరి పాపం పండినట్టేనని అంతా భావించారు.. తీరా సీన్ రివర్స్ అయింది.. ఒకరేమో ఇప్పటికీ అదే పోస్టులో దర్జాగా కొనసాగుతుండగా.. మరొకరు కీలకమైన ఉద్యోగ స్థానంలో దర్జాగా అన్నీ చక్కబెట్టేస్తున్నారు. తాజాగా బదిలీల సీజన్ మొదలవడంతో వీరిద్దరూ మళ్లీ అవే స్థానాల్లో కొనసాగేందుకు తెగ పావులు కదుపుతున్నారు. వీరిద్దరిపై గతేడాది విజిలెన్స్ కేసులు నమోదవగా, కనీసం చర్యలు కూడా లేకుండా ఉండేలా పైరవీలు చేస్తున్నారు. వారిద్దరే కాకినాడ జిల్లా డ్వామా పీడీ.. కాకినాడ కలెక్టరేట్ ఏవో రామ్మోహన్.

6



సత్యదేవా.. ఏమిటీ వైపరీత్యం?

- అన్నవరం దేవస్థానంలో ఇటీవల వరుస వివాదాలు
- ఆలయ ప్రతిష్ట మసకబారే ప్రమాదం
- కొందరు ఉద్యోగుల్లో బాధ్యతారాహిత్యం.. మరికొందరిలో నిర్లక్ష్యం

(ఆంధ్రజ్యోతి-అన్నవరం)

ఏ ఇంట శుభకార్యం జరిగినా ముందుగా గుర్తొచ్చేది అన్నవరం సత్యదేవుడి వ్రతం. ఈ ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా నిలిచింది. కానీ ప్రస్తుతం వరుస వివాదాలతో ఆలయ ప్రతిష్ట మసకబారే ప్రమాదం పొంచిఉంది. ఈ వివాదాలకు ప్రధాన కారణం కొందరు ఉద్యోగుల్లో బాధ్యతారాహిత్యం, మరికొందరు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడమే కారణం. దీనికితోడు సిబ్బందిని సమన్వయం చేసుకోవడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో మితిమీరిన అవినీతి కనిపించినా వివాదాలు రచ్చకెక్కలేదు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నతాధికారికి అవినీతి ఆనవాళ్లు లేకపోయినా అనుభవరాహిత్యంతో ఇతర విభాగాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారు. ఒక ఏఈవో దేవస్థానానికి జమచేయాల్సిన నగదు రూ.98 వేలు సొంతానికి వాడుకున్నాడు. ఇది రుజువుకావడంతో ఆ మొత్తం ఏఈవోతో దేవస్థానానికి జమ చేయించారు. ఇక రెండు వర్గాలుగా ఉన్న ఉద్యోగుల్లో ఎవరికి వారు పెత్తనం చెలాయించాలని చూసినా ఎవరికీ అవకాశం దక్కలేదు. ఆలయ వ్యవహారాల్లో ఈవో కుమారుడు పెత్తనం చేయడం అప్పట్లో ఈవో వెన్నంటి ఉండే ఒక సూపరింటెండెంట్ వ్యవహారశైలితో ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగుల్లో కొందరు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ.. మరికొందరు సెలవు పెట్టడంతో వివాదం రాజుకుంది. దీనిపై పరిస్థితిని చక్కదిద్దేందుకు దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ విచారణ అధికారిగా అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ విచ్చేసి నివేదికను సమర్పించారు. ఇందులో ఈవో అవినీతికి పాల్పడలేదని, సిబ్బందిని సమన్వయం చేసుకోలేకపోయారని పొందుపరిచినట్టు సమాచారం. తదనంతరం భక్తుల సౌకర్యాల కల్పనలో అందుతున్న సేవలపై ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేల్లో అన్నవరం దేవస్థానం చివరి స్థానానికి చేరడంతో ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ నెలకొకసారి పర్యటించి పరిస్థితిని చక్కదిద్దారు. నీటి ఎద్దడి సాకుగా చూపించి దేవస్థానంలో మండు వేసవిలో భక్తులకు ఏసీ గదులు కేటాయించకుండా ఈవో తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. వెంటనే కాకినాడ జిల్లా కలెక్టర్ కలుగజేసుకుని ప్రత్యామ్నాయ మార్గం వెతకాలని.. ఏసీ గదుల కేటాయింపు నిలుపుదల చేయడం సరికాదని సుతిమెత్తగా హెచ్చరించడంతో యథావిధిగా గదుల కేటాయింపు చేపట్టారు. సత్యదేవుడి కల్యాణోత్సవాల సమయంలో పలు ఆర్జిత సేవలను నిలుపుదల చేసిన సమయంలో వైదిక కమిటీ గతంలో నిర్వహించిన చండీ, ప్రత్యంగిర హోమాలను అదనంగా నిలుపుదల చేయడం వివాదాస్పదమైంది. దీంతో శృంగేరీపీఠాధిపతుల సూచనలతో ఏకీభవించి వారి అభిప్రాయం తీసుకోవాలని దానికి అనుగుణంగా నడుచుకోవాలని చైర్మన్ తెలపడంతో సద్దుమణిగింది. దేవస్థానంలో సేవ చేసేందుకు తెలంగాణ నుంచి విచ్చేసిన సేవా బృందంపై ఏఈవో దురుసుగా ప్రవర్తించడం తక్షణమే కొండ దిగి వెళ్లిపోవాలని లేకుంటే కేసులు పెడతామని హెచ్చరించడంతో విషయం వివాదాస్పదమైంది. దీంతో సేవకులకు అన్ని సౌకర్యాలు కల్పించి ఏఈవోకు షోకాజు నోటీసు జారీ చేశారు. సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాల్లో శ్రీపుష్పయోగం రోజున తన భార్యపై ఏఈవో అసభ్యకరంగా తాకి తోయడంతో నేరుగా ఆ భక్తుడు సీఎంవోకు ఫిర్యాదు చేయడంతో మరో వివాదం తెరమీదకొచ్చింది. దీంతో ఆ ఏఈవోను ఆలయ విభాగ బాధ్యతల నుంచి తప్పించి మరో విభాగానికి మార్చారు. రెండురోజుల కిందట సీఆర్వోలో గదులు ఖాళీలున్నా కేటాయించకపోవడంతో భక్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అర్ధరాత్రి ఈవో సీఆర్వో కార్యాలయానికి చేరుకుని భక్తులకు దగ్గరుండి గదులను ఇప్పించారు. దీనికి అక్కడ పనిచేసే కౌంటర్ గుమస్తాల నిర్లక్ష్యం కారణంగా బాధ్యులను చేస్తూ ఇద్దరిని సస్పెండ్ చేశారు.

క్షేత్ర స్థాయిలో తెలుసుకుంటేనే..

ఈవో క్షేత్రస్థాయిలో తిరగకుండా కేవలం సమీక్షలు, సమావేశాలతో పాలన సాగించడంతో ఈ వివాదాలు పెరుగుతున్నాయన్న విమర్శలున్నాయి. సిబ్బంది సైతం బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగుల జీతభత్యాలు, ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్లు అన్నీ.. దేవస్థానం ఖజానా నుంచి చెల్లించాలంటే భక్తుల పట్ల మర్యాదగా మెలగడం ద్వారా స్వామి సన్నిధిలోకి వివిధ రూపాల్లో ఆదాయం పెరుగుతుందని పలువురు సూచిస్తున్నారు.

నిషేధ సమయంలో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దు : కలెక్టర్

- అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక బృందాల తనిఖీలు
- సీజ్ చేసిన ఇసుక గృహ నిర్మాణ పనులకు వినియోగం

రాజమహేంద్రవరం, జూన్4 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిషేధ సమయంలో ఇసుక తవ్వకాలు జరపకూడదని, వాటిపై పర్యవేక్షణ అవసరమని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి డీఎల్ఎస్‌ఏ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 1నుంచి సెమీ మెకనైజ్డ్ రీచ్‌ల వద్ద ఇసుక తవ్వకాలు నిలిపివేస్తూ ఆదేశాలిచ్చామని, ఎవరైనా ఆయా ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరిపితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతోపాటు సీజ్ చేసిన వాహనాల నుంచి అపరాధ రుసుము వసూలు చేయడమే కాకుండా సీజ్‌చేసిన ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద డంప్ చేసి ప్రభుత్వ నిర్మాణ, ఇళ్ల నిర్మాణ పనులకు వినియోగించాలని, వాటిపై నివేదిక కూడా ఇవ్వాలన్నారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో విజిలెన్స్ బృంద సభ్యులతో ఆకస్మిక తనిఖీలు, దాడులు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ప్రాంతాల్లో సమన్వయ శాఖల అధికారులతో కచ్చితంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌జీటీ మార్గదర్శకాలు కచ్చితంగా అమలుచేయాలని, ఎటువంటి మీమాంసకు తావులేదన్నారు. సీజ్ చేసిన ఇసుక ఎక్కడ డంప్ చేశారో వివరాలు చెప్పాలన్నారు. 19 కేసులు నమోదు చేసి, 10 కేసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని అధికారులు చెప్పగా, మిగతా కేసుల విషయంలో ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదో వివరణ ఇవ్వాలన్నారు. ఇక వర్షాకాలం దృష్ట్యా 9 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద డంప్ చేసినట్టు వివరించారు. జేసీ ఎస్. చిన్నరాముడు మాట్లాడుతూ ఇసుక రీచ్ నిర్వహణ, నిషేధ సమయంలో డీ సిల్టేషన్ అనుమతులు, సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌ల వద్ద కార్యకలాపాల్లో ఎటువంటి తవ్వకాలు జరగకూడదన్నారు. ఆర్డీవోలు ఆర్ కృష్ణ నాయర్, రాణి సుస్మిత, జిల్లా మైన్స్ అధికారి డి. ఫణిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పురోగతి బాధ్యత ప్రత్యేకాధికారులదే

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహనిర్మాణాల పురోగతిపై ప్రతీ వారం సమీక్షిస్తున్నామని, స్టేజి కన్వర్షన్ విధానంలో నిర్లిప్తత చూపిస్తే ఉపేక్షించేది లేదని, పురోగతి బాధ్యత ప్రత్యేకాధికారులదేనని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టంచేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డివిజన్, మండల స్థాయి ప్రత్యేకాధికారులతో గృహనిర్మాణ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లు లేని ప్రతీ ఒక్కరి సొంత ఇంటి నిర్మాణంకోసం అదనపు ఆర్థిక సహాయం అందజేసేటపుడు ఆయా లబ్ధిదారులు ఇంటి నిర్మాణంలో ముందుకు వెళ్లేలా చూసి వారి అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే అదనపు ఆర్థిక సహాయం చేశామన్నారు. రెండు దశల్లో నిర్మాణం నిర్ధారణ చేసుకున్న తర్వాతే అదనపు సహాయ నిధులు ఇచ్చామన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణం, వచ్చేవారం పురోగతిపై సమీక్షించాలని, ప్రతీ రోజూ ఉదయం క్షేత్ర స్థాయిలో పరిశీలనచేసి లబ్ధిదారుల వారీగా నివేదిక ఇవ్వాలన్నారు. నిర్మాణాల పురోగతిలో బాగా వెనుకబడి ఉన్న ఇద్దరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేయడానికి సిఫార్స్ చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో అసలు మొత్తం 10,794 పేదల ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 5,957 పూర్తి చేశామని, ఇది 55.18 శాతం అన్నారు. ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ ఎస్.భాస్కరరెడ్డి మాట్లాడుతూ అదనపు ఆర్థిక సహాయంలో మొదలెట్టిన 3362 ఇళ్లలో 701 లింటల్ లెవల్, 464 రూఫ్ లెవల్, 49 రూఫ్ కంప్లీట్ స్థాయిలో ఉన్నాయన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఇళ్ల నిర్మాణంలో ఆశించిన పురోగతి లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారన్నారు. మూడు నెలలుగా ఒక్క ఇల్లు కూడా కట్టకుండా రాబోయే పది రోజులలో పూర్తి చేస్తామని ఎలా చెప్పగలుగుతున్నారని ముఖ్యంగా ఆయన ప్రశ్నించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో పీపీవో జేడీ ఎల్. అప్పలకొండ, డీఆర్డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి, డీఎల్‌డీవో పి.వీణాదేవి పాల్గొన్నారు.

నాలుగో రోజుకు 46.21% రేషన్

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రేషన్‌షాపుల వద్దే సరుకుల పంపిణీ ప్రజలకు ఆనందాన్ని కలిగిస్తోంది. 65 ఏళ్లు దాటిన లబ్ధిదార్లకు మాత్రం ఇళ్లకు తీసుకుని వెళ్లి సరుకులు ఇస్తున్నారు. జూన్ 1 నుంచి 4వ తేదీ వరకూ నాలుగు రోజుల్లో 46.21 శాతం సరుకులు పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ సరుకులంటూ ఒక వాహనాన్ని పంపి వీధుల్లో నిలబెట్టి సరుకులిచ్చేవారు. కొన్ని ప్రాంతాలకు వచ్చేసరికి 15వ తేదీ దాటేసేది. పాత పద్ధతిలోనే డీలర్ షాపువద్దే సరుకులు ఇచ్చేటట్టు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. జిల్లాలో 871 దుకాణాలుండగా, 5,64,994 బియ్యం కార్డులు ఉన్నాయి. బుధవారం నాటికి 2,61,064 మంది కార్డుదారులకు రేషన్ షాపుల వద్ద సరుకులు ఇచ్చామని, 15వ తేదీ వరకూ సమయం ఉన్నా ముందే అందరికీ పంపిణీ చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డీఎస్‌వో)రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు.



బాలబాలాజీ ఆలయంపై ఆకట్టుకునే శిల్ప సౌందర్యం

బాల తిరుపతి.. వెళ్లొద్దాం

- కోరిన కోర్కెలు తీర్చే శ్రీనివాసుడు
- నేటి నుంచి అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు
- సర్వాంగ సుందరంగా ముస్తాబైన ఆలయం



అప్పనపల్లి బాలబాలాజీస్వామివారు

(మామిడికుదురు-ఆంధ్రజ్యోతి)

వైనతేయ నదీ తీరంలోని అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానం బాలతిరుపతిగా వర్ధిల్లుతోంది. ఇక్కడ ఏడు ప్రదక్షిణలు చేసి ఏడు టెంకాయలు సమర్పిస్తే స్వామివారు కోరిన కోర్కెలను తీరుస్తారని భక్తుల విశ్వాసం. ఈనెల 5వతేదీ గురువారంనుంచి అప్పనపల్లి బాలబాలాజీ కల్యాణోత్సవాలు జరగనున్నాయి. ఈసందర్భంగా ప్రత్యేక కథనం..

ఆలయ చరిత

అప్పనపల్లి బాలబాలాజీ ఆలయాన్ని చూసేందుకు రెండు కళ్లు చాలవన్నట్టుగా అద్భుతమైన శిల్ప సౌందర్యంతో సర్వాంగసుందరంగా నిర్మించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని మామిడికుదురు మండలం అప్పనపల్లిలో ఈ ఆలయం ఉంది. ఇక్కడ పుట్టలో ఉన్న శ్రీకృష్ణుడికి పాలు ఇస్తున్న గోమాతను తదేకంగా చూస్తున్న యాదవుడి చిత్రంతోపాటు అర్జునుడికి గీతోపదేశం చేస్తున్న చిత్రం ఆకట్టుకుంటున్నాయి. 1962లో గ్రామానికి చెందిన మొల్లేటి రామస్వామి తన కొబ్బరి కొట్టులో కనిపించిన చిన్న విగ్రహాన్ని అమర్చగా ఆ కొబ్బరి కొట్టే ఆలయంగా మారింది. అక్కడకు వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో భక్తులు భోజనాలకోసం పడుతున్న ఇబ్బందులు చూసి రామస్వామి ఆలయ ప్రాంగణంలోనే అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటగా 1977లో నిత్యాన్నదానాన్ని దేవస్థానంలో మొదలుపెట్టారు. అప్పనపల్లి నిత్యాన్నదానమే ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు దేవాలయాల్లో అన్నదానానికి ఆదర్శంగా నిలిచింది. ఆనాటినుంచి ఇప్పటివరకు దేవస్థానంలో నిత్యాన్నదానం నిరంతరాయంగా కొనసాగుతోంది. ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకు అన్నదానంతో పాటు పిల్లలకు పాలు పంపిణీ చేస్తారు.

దేవస్థానంలో జరిగే ఉత్సవాలు..

ప్రతిఏటా బహుళ పంచమి నుంచి సప్తమి వరకు పవిత్రోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి రోజున స్వామివారి దివ్యకల్యాణాన్ని కన్నులపండువగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. విజయదశమి రోజున పద్మావతి అమ్మవారికి లక్ష కుంకుమార్చన, కార్తీక శుద్ధ ఏకాదశి రోజున స్వామివారికి లక్ష తులసి పూజ, ధనుర్మాస దీక్షలు నిర్వహిస్తారు. బహుళ చవితి రోజున గోదాదేవి కల్యాణం జరుగుతుంది. ఆలయంలో నిత్య కల్యాణం, లక్ష్మీనారాయణ హోమం, సుప్రభాత సేవ, తొలిహారతి, వేద పారాయణలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు.

రేపు రాత్రి 9.15 గంటలకు కల్యాణం

అప్పనపల్లి బాలబాలాజీ స్వామివారి తిరు కల్యాణోత్సవాలు గురువారం ప్రారంభంకానున్నాయి. వీటిని ఘనంగా నిర్వహించడానికి ఆలయ సహాయ కమిషనర్ ముదునూరి సత్యనారాయణ రాజు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని వివిధ రకాల విద్యుద్దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. గురువారం ఉదయం 6గంటలకు విశ్వక్సేనారాధనతో కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేస్తారు. స్వామివారు, ఉభయ దేవేరులను వధూవరులుగా తీర్చిదిద్ది ఉత్సవాలకు శ్రీకారం చుడతారు. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి శుక్రవారం రాత్రి 9.15గంటలకు కల్యాణం జరుగుతుంది. ప్రతిరోజూ స్వామివారికి సుప్రభాతసేవ, సహస్రనామార్చనలు, వివిధ రకాల పూజలు జరుపుతారు. 7వతేదీ సాయంత్రం 4గంటలకు పండిత సత్కారం, 8వతేదీ ఉదయం పది గంటలకు స్వామివారికి వైనతేయనదిలో చక్రస్నానం, 9వతేదీ ఉదయం 9 గంటలకు చోరసంవాదం, సాయంత్రం రాత్రి గంటలకు ద్వాదశ ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలు జరిగే ఐదురోజులూ సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.



కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయంలో చేస్తున్న ఏర్పాట్లు



చింతచిగురు కిలో రూ.600

- పట్టణాల్లో భారీగా డిమాండ్

(ఆత్రేయపురం-ఆంధ్రజ్యోతి):

కోనసీమలోని పల్లెల్లో ఎక్కడపడితే అక్కడ ఉండే చింత చెట్ల నుంచి లభించే చింతచిగురుకు ఎంతో డిమాండ్ ఉంది. ప్రస్తుత వేసవి సీజన్‌లో చింతచిగురు పల్లెల్లో పుష్కలంగా లభిస్తోంది. చెట్టు ఎక్కి చిగురు కోసి పట్టణ, పల్లె ప్రాంతాల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. గృహిణులు చింతకూరను ఏడాదిపాటు ఉండేలా ఉప్పు కలిపి బిళ్లలు చేసి ఎండపెట్టి డబ్బాల్లో వేసుకుని ఏడాదిపాటు కూరలో ఉపయోగిస్తారు. చింతకూరతో చేసిన కూరలు భలే రుచిగా ఉంటాయి. చిగురులో విటమిన్-సి పోషకాలు అధికంగా ఉంటాయి. రోగ నిరోధక శక్తిని పెంపొందించి వ్యాధులను నయం చేస్తుంది. జీర్ణవ్యవస్థ మెరుగుపరచడంతో పాటు మలబద్ధకం తగ్గించి ఆకలి పెరగడానికి దోహదం చేస్తుంది. చింతచిగురులో పోషకాలు ఉండడంతో రోగగ్రస్థులు అమితంగా ఇష్టపడతారు. దానికి ఉన్న డిమాండ్ రీత్యా కిలో రూ.600కి అమ్ముతున్నారు. ఈ సీజన్లో పప్పులో చింతచిగురు వేసి నెయ్యి వేసుకుని శాఖాహారులు ఎంతో ఇష్టంగా భుజిస్తారు. చింతచిగురు పచ్చిరొయ్య, చింతచిగురు మటన్, చింతచిగురు ఎండురొయ్య వంటి రకరకాల వంటకాలు మాంసాహారప్రియులు వండిస్తూ బంధు మిత్రులకు పంపించి రుచి చూపిస్తారు. చింతచిగురుతో నాన్‌వెజ్ వంటకాలు తిని తీరాల్సిందే. ఈ సీజన్‌లో ఎక్కడైనా కనిపిస్తే చింతచిగురు వదలద్దండోయ్.

పెత్తనం అంతే... పోనివ్వమంతే

- ప్రభుత్వం మారి ఏడాదైనా కీలక పోస్టుల్లో వైసీపీ సానుకూల అధికారులదే పెత్తనం
- ఐదున్నరేళ్ల నుంచీ ఉమ్మడి, కాకినాడ జిల్లా డ్వామా పీడీగా చక్రం తిప్పుతున్న వెంకటలక్ష్మి
- ఐదేళ్లు వంగాగీత పీఏగా పనిచేసిన రామ్మోహన్ కాకినాడ కలెక్టరేట్ ఏవోగా అక్రమాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా)పీడీగా ప్రస్తుతం వెంకటలక్ష్మి కొనసాగుతున్నారు. ఆమె 2020లో ఉమ్మడి జిల్లా డ్వామా పీడీగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటినుంచీ తన పలుకుబడి ఉపయోగిస్తూ బదిలీ లేకుండా ఇక్కడే కొనసాగుతున్నారు. ప్రస్తుతం బదిలీల ప్రక్రియ నడుస్తుండడంతో బదిలీ ఆపించుకుని ఇక్కడే ఉండేలా పావులు కదుపుతున్నారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో ఈమె అడ్డగోలుగా వ్యవహరించారు. పేదల ఇళ్లస్థలాల సేకరణ తర్వాత వాటిని చదును చేసే బాధ్యత డ్వామా పర్యవేక్షించింది. బిల్లుల చెల్లింపు అంతా ఈమె పర్యవేక్షణలోనే కొనసాగింది. ఈక్రమంలో ఎక్కడికక్కడ ఉమ్మడి జిల్లాలో వందలాది లేఅవుట్ల చదునులో భారీగా అక్రమాలు జరిగాయి. ఈ పనులు చేసిన వైసీపీ ఎమ్మెల్యేలు, వారి అనుచరులు చదును పనులు నాసిరకంగా చేశారు. అయినా ఈమె కిమ్మనలేదు. ఎంచక్కా తన పర్సంటేజీతో బిల్లులు మంజూరు చేసేశారు. ప్రధానంగా కాకినాడ జిల్లాలో ఉప్పాడ కొత్తపల్లి మండలం కొమరగిరిలో అప్పటి సీఎం జగన్ 850ఎకరాల లేఅవుట్‌కు శంకుస్థాపన చేశారు. సీఎం డ్రీం ప్రాజెక్టు పేరుతో ప్రభుత్వం ఇక్కడ ప్రత్యేక దృష్టిసారించింది. చదునుకు రూ.250 కోట్ల వరకు కేటాయించింది. ఈ క్రమంలో కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కనుసన్నల్లో చదును జరిగింది. నిత్యం వందల టిప్పర్లలో రామేశంమెట్ట, పోలవరం కాలువల నుంచి అక్రమంగా మట్టి తరలించారు. గనుల శాఖకు సీనరేజీ చెల్లించకుండా డంప్ చేసేశారు. ఈ లేఅవుట్ చేయాల్సిన స్థాయిలో చదును చేయకుండానే చేసేసినట్లు సదరు పీడీ కోట్లలో బిల్లులు చెల్లించేశారు. ప్రభుత్వం మారిన తర్వాత కొమరగిరి లేఅవుట్ చదును అక్రమాలపై గతేడాది విజిలెన్స్ విచారణ మొదలుపెట్టింది. ఇందులో ద్వారంపూడికి సదరు పీడీ అడ్డగోలుగా బిల్లులు చెల్లించినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. ఈమెపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. అయినా ఇప్పటికీ ఈమెపై చర్యలు లేవు. అటు ఉమ్మడి జిల్లా పీడీగా చేసిన అక్రమాలపై ఇప్పటికీ విచారణ జరగలేదు. మరోపక్క ఉమ్మడి జిల్లా పీడీగా, ఆ తర్వాత జిల్లాల విభజనతో కాకినాడ జిల్లా పీడీగా మొత్తం ఐదున్నరేళ్ల నుంచీ ఈమె ఇక్కడే కొనసాగుతున్నారు. వివిధ విభాగాల ఉద్యోగుల బదిలీలు, ఇతర పోస్టింగ్‌ల్లో ఇప్పటికీ ఇష్టానుసారంగా వ్యవహ రిస్తున్నారు. ఎక్కడికక్కడ శాఖను సొంత కంపెనీలా మార్చేసుకుని అడ్డగోలుగా సంపాదించేశారు. ఇంత జరిగినా ఈమెపై ఇప్పటికీ చర్యలు లేవు. కనీసం బదిలీ కూడా లేదు. తాజా బదిలీల్లోను ఈమె ఇక్కడే కొనసాగేలా వైసీపీ నేతల ద్వారా రాయబేరాలు నడుపుతున్నారు.

ఈయన మరీ ముదురు..

కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారి(ఏవో)గా రామ్మోహన్ కొనసాగుతున్నారు. ఈయన వైసీపీ అయిదేళ్ల పాలనలో ఇష్టానుసారంగా వ్యవహరించారు. డిప్యూటీ తహసీల్దార్ హోదాలో కాకినాడ ఎంపీ వంగా గీత వద్ద ప్రభుత్వ పీఏగా చేరారు. ఆ తర్వాత కొలువును అడ్డంపెట్టుకుని అధికారులపై తెగ పెత్తనం చేశారు. తనకు కావాల్సిన వారిని వివిధ పోస్టింగ్‌ల్లో బదిలీ చేయించుకుని ఆ ఐదేళ్లు చెలరేగిపోయారు. ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఎంపీ గీత రికమండేషన్‌తో కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల విభాగంలో పోస్టింగ్ వేయించుకున్నారు. ప్రభుత్వం మారడంతో సదరు రామ్మోహన్ అరాచకాలకు చెక్‌పడుతుందని భావించారు. తీరా గీత ఒత్తిడితో అధికారులు ఈయనకు ఏకంగా కలెక్టర్ కార్యాలయ ఏవోగా పోస్టింగ్ ఇచ్చారు. కలెక్టరేట్‌లో కలెక్టర్, డీఆర్వో తర్వాత ఏవో పోస్టు అత్యంత కీలకం. జిల్లాలో ప్రభుత్వానికి, పాలనకు సంబంధించి అనేక కీలక నిర్ణయాల ప్రతిపాదనలు, నిర్ణయాలు ఏవో చేతులు మీదుగా ముందుకు సాగుతాయి. ఇవన్నీ ఎప్పటికప్పుడు ఇప్పటికీ వైసీపీ నేతలకు సదరు రామ్మోహన్ ద్వారా ముందే చేరిపోతున్నాయి. వారికి కావాల్సిన ఉద్యోగులు, అధికారులకు నచ్చిన చోట పోస్టింగ్‌లు ఇప్పటికీ ఈయన ద్వారా జరుగుతున్నాయి. జిల్లాలో పలువురు ఉద్యోగులపై గతంలో పెండింగ్‌లో ఉన్న క్రమశిక్షణ చర్యల కేసులను ప్రస్తుత కలెక్టర్ షాన్‌మోహన్ మానవతా దృక్పథంతో రద్దు చేశారు. ఫైలు కలెక్టర్‌కు పంపే ముందే వారితో బేరాలు కుదుర్చుకుని లక్షల్లో సదరు ఏవో గుంజేశారు. వారసత్వం కింద చనిపోయిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు కొంతకాలంగా ఇస్తున్న ఉద్యోగాలకు వారినుంచీ పోస్టును బట్టి రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు పిండేశారు. కలెక్టరేట్, ఇతర తహసీల్దార్ కార్యాలయాల్లో ప్రమోషన్ల తర్వాత ఉద్యోగుల పోస్టింగ్‌లకు సంబంధించి ఉన్నతాధికారులు సూచించిన జాబితాలను సదరు ఏవో పలుసార్లు లీక్ చేసి ఆ జాబితాలను తారుమారు చేసేశారు. దీనిపై ఉన్నతాధికారులు పలుసార్లు వార్నింగ్‌లు సైతం ఇచ్చిన పరిస్థితి. ప్రస్తుతం ఉద్యోగుల బదిలీల సీజన్ నడుస్తుండడం, కాకినాడ కలెక్టరేట్ అల్లూరి జిల్లాతో సహా ఉమ్మడి జిల్లాకు నోడల్ కార్యాలయం కావడంతో సదరు ఏవో అనేక మంది ఉద్యోగులకు ఫోన్లు చేసి మీకు ఇంకా ఏజెన్సీ సర్వీసు లేదని, అక్కడకు వెళ్లాల్సి ఉంటుందనే సాకుతో అమ్యామ్యాలు పిండేస్తున్నారు. కాగా తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో తహసీల్దార్ క్యాడర్‌ఉన్న అధికారులు కలెక్టరేట్ ఏవోలుగా కొనసాగుతుండగా, కీలకమైన కాకినాడ జిల్లా కలెక్టరేట్ ఏవోగా ఉప తహసీల్దార్ స్థాయి ఉన్న రామ్మోహన్‌ను కొనసాగిస్తుండడం విశేషం.

విజిలెన్స్ కేసున్నా హవా..

రామ్మోహన్ గతంలో ఉమ్మడి జిల్లాలో కాకినాడ పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేశారు. అప్పట్లో ధాన్యం రవాణా కాంట్రాక్టర్‌కు అనుకూలంగా వ్యవహరించారు. దీనిపై 2014-2015లో విజిలెన్స్ విచారణ చేపట్టింది. ధాన్యం సేకరణ సమయంలో ట్రక్ షీట్లు సమర్పించకముందే జాయింట్ కలెక్టర్ ఆమోదం లేకుండా రూ.3.50కోట్లు కాంట్రాక్టర్‌కు అడ్వాన్సుగా 2015, జనవరి, ఫిబ్రవరిలో చెల్లించినట్లు విజిలెన్స్ గుర్తించింది. ట్రక్ షీట్లలో సరుకు రవాణాయేతర వాహనాలు చూపితే అవి సరైనవో కావో చూడకుండా బిల్లులు చెల్లించినట్లు విజిలెన్స్ నిర్ధారించింది. ఏమాత్రం ఆధారాలు లేకపోయినా డీటీ హోదాలో రామ్మోహన్‌పై నిధులు చెల్లించినట్లు విజిలెన్స్ తేల్చింది. దీనిపై అప్పటి వైసీపీ నేతల ద్వారా పైరవీలు నడిపించిన రామ్మోహన్ కేసు లేకుండా చేసుకున్నారు. గతేడాది అక్టోబరు 10న మళ్లీ అతడిపై విజిలెన్స్ కేసును రెవెన్యూశాఖ బయటకు తీసింది. ఈ అక్రమాలపై అతడి నుంచి వివరణ కోరుతూ జీవో జారీ చేసింది. ఇంత జరిగి విజిలెన్స్ కేసు ఉన్నా సరే సదరు రామ్మోహన్‌ను అధికారులు ఈ కేసును దాచిపెట్టి ఏవో పోస్టులో కొనసాగించడం విశేషం. ప్రస్తుతం విజిలెన్స్ కేసు ఇబ్బందికరంగా మారడంతో రామ్మోహన్ ఈ కేసు నుంచి బయటపడేందుకు చక్రం తిప్పుతున్నారు. గతంలో ఇక్కడి పనిచేసి ప్రస్తుతం అమరావతిలో రెవెన్యూశాఖ విజిలెన్స్ విభాగంలో పని చేస్తున్న కీలక అధికారి ద్వారా ఈకేసు నుంచి బయటపడేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. అటు ఏవో పోస్టును వదలకుండా పైరవీలు తీవ్రతరం చేశారు.

తల్లిదండ్రులు లేని పిల్లలకు అండగా డిప్యూటీ సీఎం పవన్

- నా జీతం-మీ జీవితం కోసం అంటూ 42మందికి రూ.2.1లక్షలు అందజేత



డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన నగదు సహాయాన్ని చిన్నారులకు అందజేస్తున్న జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు

పిఠాపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు లేని పిల్లలకు అండగా నిలిచేందుకు తనకు పిఠాపురం శాసనసభ్యుడిగా, మంత్రిగా వచ్చే వేతనం, భత్యాలు వారికే వెచ్చిస్తానంటూ చేసిన ప్రకటనకు అనుగుణంగా కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో 42మందికి రూ.5వేల వంతున రూ.2.10లక్షలను పంపిణీ చేశారు. తొలినెల పవన్‌కల్యాణ్ స్వయంగా పిల్లలకు ఈ మొత్తాలను అందించారు. ఈ నెల జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, ఇతర నాయకులు బుధవారం వారి ఇంటింటికీ వెళ్లి రూ.5వేల వంతున అందజేశారు. నా జీతం-మీ జీవితం కోసమంటూ పవన్‌కల్యాణ్ నిస్వార్థంగా తనకు వచ్చే వేతనాన్ని పిల్లల భవిష్యత్తుకు వెచ్చిస్తున్నారని మర్రెడ్డి తెలిపారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవడమేగాక తనను గెలిపించిన పిఠాపురం నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకునేందుకు అనుక్షణం ప్రయత్నిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి, గోదావరి ఈస్ట్రన్ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక



రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో మాధవి తదితరులు

అమలాపురం టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అమలాపురం విద్యానిధి విద్యాసంస్థల ప్రాంగణంలో జిల్లాస్థాయి సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. ఉదయం నుంచి క్రీడాకారుల మధ్య హోరాహోరీగా పోటీలు జరిగాయని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి తాడి వెంకటసురేష్ తెలిపారు. ద్రాక్షారపు సాత్విక్ (ప్రథమ), తాడి వెంకటేష్ (ద్వితీయ), బండారు నానిబాబు (తృతీయ), ఫణిశెట్టి ధరణి (చతుర్థ) స్థానాల్లో నిలిచారు. ఈ నెల 6వ తేదీ నుంచి విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి సీనియర్ ఓపెన్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలకు వీరిని ఎంపిక చేసినట్టు వెంకట సురేష్ తెలిపారు. విద్యార్థులకు విద్యానిధి ప్రిన్సిపాల్ టి.మాధవి షీల్డులు, సర్టిఫికెట్లు అందజేశారు.

10న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం

- ఏర్పాట్లు పరిశీలించిన కమిషనర్ కేతన్ గార్గ్



టాటా ఇన్నోవేషన్ హబ్ సెంటర్‌ను పరిశీలించి సూచనలు చేస్తున్న కమిషనర్ కేతన్ గార్గ్

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో ఆర్‌డీఐహెచ్ భవనం ఏర్పాటు చేస్తున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఈనెల 10న ప్రారంభిస్తున్నట్లు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. బుధవారం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు పనులు కమిషనర్ పరిశీలించారు. ఈసందర్భంగా పలుసూచనలు సంబంధిత అధికారులకు చేశారు. అనంతరం కమిషనర్ కేతన్ మాట్లాడుతూ గడువు తేదీ సమీపిస్తుండటంతో పనులు వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించామన్నారు. రూ.75లక్షల వ్యయంతో ఆర్డీఐహెచ్‌భవనాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. రాత్రి పగలు వేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. స్కిల్‌డవలప్‌మెంట్, ఇన్నోవేషన్ స్టార్టప్స్, ఫెసిలిటీ కేంద్రంగా ఈ ఇన్నోవేషన్ హబ్ పనిచేస్తుందన్నారు. రతన్ టాటా స్ఫూర్తితో ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేసి తద్వారా ఆయా కుటుంబాలను బాగుచేయాలన్నది ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. ఈ పరిశీలనలో ఆయన వెంట కార్పొరేషన్ ఎస్ఈ ఎంసిహెచ్ కోటేశ్వరరావు, ఈఈ మదర్సా అలీ షేక్, జిల్లా గ్రామ పంచాయతీ ఆఫీసర్ వి.శాంతామణి, ఎంపీడీవో ఆంస్ట్రాంగ్, ఇతర అధికారులు ఉన్నారు.

9న చిరంజీవినీకుమారి సంస్మరణ సభ

కాకినాడ రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన ప్రముఖ విద్యావేత్త, ఐడియల్ విద్యా సంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి ఈనెల ఒకటో తేదీన కన్నుమూసిన సంగతి తెలిసిందే. కాకినాడ-సామర్లకోట రోడ్డులోని ఇంద్రపాలెం లాకులవద్ద గల ఐడియల్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 9న చిరంజీవినీకుమారి సంస్మరణ సభ నిర్వహించనున్నట్టు ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు.

జాతీయస్థాయి యోగా పోటీలకు ముగ్గురు ఎంపిక



యోగా పోటీలకు ఎంపికైన వారిని అభినందిస్తున్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత భైరవస్వామి

అమలాపురంటౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అమలాపురంలోని శ్రీస్వామి వివేకానంద యోగాశ్రమంలో శిక్షణ పొందుతున్న ముగ్గురు విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు యోగా గురువు ఆకుల శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బండారు మేఘన, చామకూర వర్షిని, గుత్తుల ప్రవీణ్ జూనియర్ కేటగిరీలో ప్రతిభ చాటారు. వీరు ఈ నెల 12న ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీల్లో పాల్గొంటారన్నారు. విద్యార్థులను రాష్ట్రపతి అవార్డు గ్రహీత, యోగా నేషనల్ జడ్జి మోటూరి భైరవస్వామి తదితరులు అభినందించారు.

కండిషనల్ అంగన్వాడీలను రెగ్యులర్ చేయాలి


- సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కాకినాడ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న అంగన్వాడీలు

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కండిషనల్ అపాయింట్‌మెంట్ ద్వారా నియమించిన 229 మంది అంగన్వాడీలను రెగ్యులర్ చేయాలని ఏపీ అంగన్ వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కాకినాడ కలెక్టరేట్ ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి, సీఐటీయూ జిల్లా కోశాధికారి మలకా రమణ మాట్లాడుతూ అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయడంలో జిల్లా అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించడంవల్లే 229 మంది అభద్రతాభావంలో ఉన్నారన్నారు. ఉద్యోగంలో చేరే సమయంలో కండిషనల్ అపాయింట్‌మెంట్ అని చెప్పకుండా పోస్టులు భర్తీ చేశారని విమర్శించారు. ఇప్పుడు రోస్టర్‌ను అనుసరించారని, 13ఏళ్లుగా పని చేస్తున్న వీరిని తొలగించడం తగదన్నారు. 2020లో అప్పటి మంత్రి తానేటి వనిత ఆదేశాల మేరకు కండిషనల్ అపాయింట్‌మెంట్‌లో ఉన్న వారిని కొనసాగించాలని సర్క్యులర్ ఇచ్చినప్పటికీ జిల్లా అధికారులు హైకోర్టుకు సమర్పించకుండా తప్పుదోవ పట్టించారన్నారు. అనంతరం కలెక్టర్ షాన్ మోహన్‌కు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, జిల్లా వర్కింగ్ కమిటీ సభ్యులు మేడిశెట్టి వెంకటరమణ, రాజేశ్వరి, ప్రసన్న, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు
వాట్సాప్‌లో విద్యార్థుల ప్రచారం



పర్యావరణంపై ప్రచారం చేస్తూ విద్యార్థులు గీసిన చిత్రాలు

సీతానగరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి) పదో తరగతి చదువుతున్న విద్యార్థులు పర్యావరణంపై చిత్రలేఖనం ద్వారా బుధవారం ప్రచారంచేసి స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బొబ్బిల్లంక హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు సూరంపూడి వైష్ణవి, తెల్లాం వీరవెంకట శ్రీదేవిలు పర్యావరణ పరిరక్షణ చిత్రాలు గీసి సోషల్ మీడియాద్వారా వాట్సాప్ గ్రూప్ ద్వారా అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. విద్యార్థులను హైస్కూల్ హెచ్ఎం కోలా సత్యనారాయణ విద్యార్థులను అభినందించారు.

కొడుకు ఊపిరి ఆపి.. చున్నీతో ఉరేసుకుని..

కాకినాడలో మహిళ బలవన్మరణం

కుటుంబ సమస్యలతో నిర్ణయం


రమ్యదీప్తి, సియాన్ ప్రశాంత్ మృతదేహాలు

కాకినాడ క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అభం, శుభం తెలియని నాలుగేళ్ల కొడుకు నోరు, ముక్కుకు పార్సిల్స్‌కు వేసే ప్లాస్టర్‌ను బిగించి ఊపి రాడకుండా చేసి చనిపోయిన తరువాత తల్లి కూడా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మ హత్యకు పాల్పడిన సంఘటన బుధవారం కాకినాడలో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం ఉండేశ్వ రపురానికి చెందిన రమ్యదీప్తి (30)కి కాకినాడ రేచర్లపేట దొర్ల వారి వీధికి చెందిన రాజాల శరత్‌బాబుతో 5ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి నాలుగేళ్ల కుమారుడు సియాన్ ప్రశాంత్ ఉన్నాడు. కాగా భార్య భర్తలిద్దరూ కొంతకాలం క్రితం ఉపాధి నిమిత్తం కొడుకుతో పాటు గల్ఫ్‌లోని అబుదబిలో ఉన్నారు. అయితే శరత్‌బాబుకు అక్కడ నుంచి వేరే చోటకు ట్రాన్స్‌ఫర్ అవ్వడంతో ఇక్కడ ఒంటరిగా ఉండడం ఎం దుకు ఇండియాకు వెళ్లిపోమ్మని భార్యకు చెప్పడంతో రమ్యదీప్తి కొడుకుని తీసుకుని 2 నెలల క్రితం ఇండియాకు వచ్చి సీతానగరంలోని అమ్మగారి ఇంటికి వెళ్లింది. అక్కడ నుంచి 10 రోజు ల క్రితం కాకినాడ రేచర్లపేటలో ని అత్తగారింటికి వచ్చింది. అయి తే ఎంఎస్సీ చదివిన రమ్యదీప్తిని అత్త శాంతి, ఆడపడుచు మెర్సీ కలసి ఇంత చదువుకుని ఖాళీగా ఏం చేస్తా వ్ గల్ఫ్ వెళ్లి సంపాదించు అంటూ ప్రతిరోజు మానసికంగా వేధిస్తుండడంతో తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైంది. మంగళవారం అర్ధరాత్రి దాటాక తలుపులు గడియ పెట్టుకుని కొడుకుకు ఊపిరాడ కుండా నోరు, ముక్కుకి ప్లాస్టర్ వేసి చనిపోయాడని నిర్ధారించుకున్నాక తాను కూడా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని విగత జీవురాలైంది. ఉదయం 8 అయినా తలుపులు తీయకపోయేసరికి అత్త, ఆడపడుచుకు అనుమానం వచ్చి కిటికీ గుండా చూసేసరికి తల్లీకొడుకులు విగతజీవులు గా ఉండడాన్ని గమనించారు. అనంతరం స్థానికుల సాయంతో తలుపులు పగులగొట్టారు. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లి గుడేటి అరు ణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్‌చార్జ్ సిఐ కెవి సత్యనారాయణ సంఘటనా స్థలికి చేరుకుని మృతదేహాలను పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని బాలుడి దుర్మరణం


తీవ్రంగా గాయపడిన శారదలీల

● మహిళకు తీవ్రగాయాలు


మరణించిన అఖిల్ (ఫైల్)

ప్రత్తిపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో పదకొండేళ్ల బాలుడు దుర్మరణం చెందాడు. దీనికి సంబంధించి ప్రత్తిపాడు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలో ఎస్.శారదలీల ఉపాధ్యాయురాలిగా పనిచేస్తోంది. కాకినాడకు చెందిన అఖిల్ (11) వేసవి సెలవుల కారణంగా కొన్ని రోజులుగా మేనత్త శారదలీల ఇంటి వద్ద ఉంటున్నాడు. బుధవారం ప్రత్తిపాడులో తన పెద్ద నాన్న సంవత్సరీకంలో పాల్గొనేందుకు శారదలీల మేనల్లుడిని తీసుకుని ద్విచక్ర వాహనంపై బయల్దేరింది. వారు ప్రత్తిపాడు జాతీయ రహదారిపై పోలవరం కాలువ వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిద్దరినీ 108 అంబులెన్సులో ప్రత్తిపాడు ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం కాకినాడ తరలిస్తుండగా సామర్లకోట వచ్చేసరికి బాలుడి పరిస్థితి విషమించడంతో అక్కడి ప్రభుత్వాసుత్రికి తరలించారు. అక్కడి వైద్యులు బాలుడు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించడంతో పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రత్తిపాడు ఎస్‌ఐ ఎస్.లక్ష్మీకాంతం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తీవ్రంగా గాయపడిన శారదలీలను కాకినాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కాగా అఖిల్ తండ్రి ఎస్‌టీజీ భాష్యం కాకినాడ ఆదిత్య కాలేజీలో లెక్చరర్‌గా, తల్లి నిహారిక ఓ ప్రైవేటు స్కూలులో ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్నారు. అఖిల్ మృతితో అతడి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ఆపేదే లేదు!

మన్యంలో ఆక్రమణల తొలగింపు ఆగదని టీడీపీ నేతలకు తేల్చిచెప్పిన అల్లూరి కలెక్టర్

రంపచోడవరం, జూన్ 4 (ఆంధ్రప్రదేశ్): మన్యంలో రహదార్ల వెంబడి ఉన్న ఆక్రమణల తొలగింపు ప్రక్రియను ఆపేదే లేదని అల్లూరి జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ తనను కలిసిన రంపచోడవరం నియోజకవర్గ దేశం నేతలకు తేల్చి చెప్పేశారు. ఇక్కడ జరుగుతున్న ఆక్రమణల తొలగింపుతో అనేక నిర్మాణాలను రెవెన్యూ అధికారులు నేలమట్టం చేసిన పర్యవసానాలపై ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వెంకటేశ్వరరావు, మాజీ ఎంపీ కొత్తపల్లి గీత ఎవరికి వారు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి వివరించిన నేపథ్యంలో కూల్చివేతల విషయంలో ఆచితూచి వ్యవహరించాలని అధికారులకు ప్రభుత్వం ఆదేశాలనిచ్చిందన్న వదంతులు రావడంతో యోగా కార్యక్రమం కోసం రంపచోడవరం వచ్చిన కలెక్టర్ దినేష్‌ను ఎమ్మెల్యే శిరీషదేవి, మాజీ ఎమ్మెల్యే శీతంశెట్టి వేర్వేరుగా కలిసి ఇక్కడి పరిస్థితులను వివరించారు. అనంతరం కలెక్టరు ఈ ఆక్రమణల తొలగింపుపై స్పందిస్తూ ఈ తొలగింపు ప్రక్రియ ఆపేది లేదని, ప్రజలు తమకు తాముగా వారి ఆక్రమణలను వారే తొలగించుకునే అవకాశాన్ని ఇస్తున్నామన్నారు. అయినప్పటికీ వారు తొలగించకుంటే మాత్రం తామే తొలగించేస్తామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా రెవెన్యూ అధికారులు ఆయా ఆక్రమణలను ప్రజలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని లేకపోతే ప్రొక్లయిన్లతో తామే తొలగిస్తామంటూ టాం టాం వేశారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తిపై అట్రాసిటీ కేసు

అమలాపురం రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు దాడి చేసిన ఘటనపై బాధిత మహిళ ఫిర్యాదు మేరకు వ్యక్తిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు అమలాపురం తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు బుధవారం తెలిపారు. కోనసీమ జిల్లా వన్నెచింతలపూడి జైభీమ్ నగర్‌కు చెందిన పచ్చిమాల అనంతలక్ష్మి(49) ఇంటి వాడకం నీరు ఎదురుగా ఉన్న తోటల్లోకి వెళ్లిందన్న నెపంపై తోట యజమాని జంపన వెంకటసుబ్బరాజు మంగళవారం ఆమెతో ఘర్షణకు దిగాడు. అంతేకాకుండా అసభ్యకరంగా ప్రవర్తిస్తూ కొబ్బరి మట్టతో ఆమెపై దాడి చేశాడు. దాంతో గాయపడ్డ ఆమెను అమలాపురం ఏరియా ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు విచారణ జరిపి అనంతలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటసుబ్బరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ పేర్కొన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అనంతలక్ష్మి వీసీకే పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంతు రమణ, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారెం వెంకటేశ్వరరావు పలువురు పరామర్శించారు.

పేలు మందు తాగిన వ్యక్తి మృతి

కరప, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగికి చెందిన పెన్నాడ వీరబాబు (38) కాకినాడలోని ఒక ఫిషరీస్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ నెల 1న మంచినీళ్ల అనుకుని పొరబాటున పేలు మందు మిశ్రమాన్ని తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు అతడిని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి, అక్కడి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కరప ఎస్‌ఐ వివరించారు.

గోల్డ్ అంతా దోచేసి.. రోల్డుగోల్డ్ వదిలేసి..

● వాకతిప్పలో చోరీ

● 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.1.20 లక్షల నగదు పట్టుకెళ్లిన దొంగలు


దొంగలు వదిలేసిన రోల్డుగోల్డ్ ఆభరణాలు

కొత్తపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం వాకతిప్పలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న కాలనీలో ఓ ఇంట్లో దొంగలు పడి 12 తులాల బంగారు ఆభరణాలతో పాటు రూ.1.20లక్షల నగదును అపహరించుకునిపోయారు. కేవలం బంగారు వస్తువులనే తీసుకుని రోల్డుగోల్డ్ ఆభరణాలను దివాన్‌కాట్‌పై పెట్టేసి వెళ్లిపోయారు. వివరాల ప్రకారం.. కొత్తపల్లి మండలం పొన్నాడు శివారు శీలం వారి పాలెం ఎలిమెంట్రీ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పేరూరి శ్రీనివాసరావు వాకతిప్పలో నివాసం ఉంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో ఈనెల 2న అన్నవరంలో ఉంటున్న బంధువుల వద్దకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు 3వ తేదీ అర్ధరాత్రి సమయంలో ఇంటి వెనుక పిట్టగోడ నుంచి లోపలికి ప్రవేశించారు. ఇంటి రెండు గదుల్లో ఉన్న బీరువాలను మారుతాళాలతో తెరిచి లాకర్లో ఉన్న 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు, హాలులో బాక్స్‌లో వేసిన 10 రూపాయల కాయిన్లు రూ.20 వేలను అపహరించుకుని పోయారని శ్రీనివాసరావు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బుధవారం తెల్లవారుజాము సమయంలో తమ ఇంటి పరిసరాల్లో ఉండే ఒకరు ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని ఫోన్‌లో చెప్పడంతో సీసీటీవీని పరిశీలించేసరికి తమ ఇంటి గుమ్మం వద్ద సీసీ కెమెరా వేలాడుతూ కనిపించడంతో వెంటనే అన్నవరం నుంచి బయలుదేరి ఇంటికి చేరుకుని చూసేసరికి బీరువా తలుపులు తెరిచి ఉన్నాయని, బీరువాలో ఉన్న బంగారు ఆభరణాలు, నగదు చోరీకి గురయ్యాయని శ్రీనివాసరావు పేర్కొన్నాడు. కేవలం బంగారు వస్తువులనే తీసుకుని రోల్డుగోల్డ్ ఆభరణాలను దివాన్‌కాట్‌పై పెట్టేసి పోయినట్టు గుర్తించారు. కొత్తపల్లి ఎస్‌ఐ జి.వెంకటేష్ చోరీ జరిగిన ఇంట్లో ఉన్న సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించారు. ఇద్దరు వ్యక్తులు ఇంటి వెనుక నుంచి లోపలికి వచ్చి సీసీ కెమెరాను పక్కకు తిప్పినట్టుగా ఉండటం రికార్డు అయ్యింది. ఇంటి లోపలకు వెళ్లినట్టు ఏ ఆధారాలు లేకుండా దొంగలు చాకచక్యంగా చోరీకి పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. కాకినాడ నుంచి వచ్చిన వేలిముద్రల నిపుణులు బీరువాలు, ఇంటి తలుపులపైన వేలిముద్రలను సేకరించారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ వెంకటేష్ తెలిపారు.


సీసీటీవీ ఫుటేజిని పరిశీలిస్తున్న కొత్తపల్లి ఎస్‌ఐ వెంకటేష్

కార్లు.. తప్పిన పెను ప్రమాదాలు!

- చక్రద్వారబంధంలో విద్యుత్ స్తంభాలను ఢీకొన్న ఐదుగురు విద్యార్థులు
- స్వల్ప గాయాలతో సురక్షితం
- సఖినేటిపల్లిలంకలో కారుపై పడిన కొబ్బరిచెట్టు
- నలుగురికి తప్పిన ప్రాణగండం


తూర్పుగోదావరి జిల్లా చక్రద్వారబంధంలో నుజ్జునుజ్జు అయిన కారు

రాజానగరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం చక్రద్వారబంధంలో బుధవారం సాయంత్రం పెను ప్రమాదం తప్పింది. జాతీయ రహదారిని ఆనుకుని సమీపంలో ఓ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు బుధవారం ఫుల్‌గా మద్యం తాగి కారులో చక్రద్వారబంధం నుంచి కానవరం పోవు రోడ్డులో పందిగొయ్యి చెరువు సమీపంలో రోడ్డుపక్కన ఉన్న విద్యుత్ స్తంభాలను ఢీకొన్నారు. దీంతో స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కారు నుజ్జునుజ్జు అయ్యింది. సమీపంలోని రైతులు భయాందోళనతో పరుగులు తీశారు. ఆ సమయంలో అటుగా ద్విచక్ర వాహనదారులు, రైతులు, పాడి గేదెలు లేకపోవడంతో సమీపంలోని రైతులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులను రైతులు ప్రశ్నించగా గైట్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన వారమని బదులిచ్చారు. రైతులు ఇచ్చిన సమాచారం మేరకు విద్యుత్‌శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే చర్యలు చేపట్టారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని రాజానగరం ఏఈ సుధాకర్ తెలిపారు. కాగా విద్యార్థుల ప్రవర్తనా తీరుపై ఆయా కళాశాలల యాజమాన్యాలు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

సఖినేటిపల్లిలంకలో..

అంతర్వేది, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లిలంక సుంకరేవులో శ్రీసత్యసాయి సేవాసమితి ట్రస్టు వద్ద సఖినేటిపల్లిలంక ప్రధాన రహదారిపై వెళ్తున్న కారుపై కొబ్బరిచెట్టు విరిగిపడింది. కారులో నలుగురు ప్రయాణిస్తుండగా కొబ్బరిచెట్టు విరిగి విద్యుత్ తీగలపై నుంచి కారు ముందు భాగంపై పడడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసమైంది. ప్రతీ నెల శ్రీసత్యసాయి సేవాసమితి ట్రస్టు సభ్యులు సుంకరేవులో ఉన్న శ్రీసత్యసాయి సేవా మందిరానికి వచ్చి తాగునీటి సరఫరా, అన్నదానం తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తుంటారు. ఈ సంఘటన వారిని ఒక్కసారిగా భయభ్రాంతులకు గురి చేసింది. ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎలక్ట్రిక్ అధికారులు విద్యుత్ వైర్లను మరమ్మతులు చేసి చెట్టు తొలగించారు.


కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలంకలో కారుపై పడిన కొబ్బరిచెట్టు

గంగలకుర్రు అగ్రహారంలో చైన్‌స్నాచింగ్

మహిళ మెడలో బంగారు సూత్రాలతాడు లాక్కెళ్లిన దుండగులు


సూత్రాలతాడు పోగొట్టుకున్న మహిళ

అంబాజీపేట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): దైవ దర్శనం చేసుకుని ఇంటికి వెళ్తున్న మహిళ మెడ లో మంగళసూత్రాలతో ఉన్న తాడును గుర్తుతెలియిన వ్యక్తులు మోటార్‌సైకిల్‌పై వచ్చి లాక్కుని వెళ్లిపోయారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం గంగలకుర్రు అగ్రహారం గ్రామంలో మంగళవారం శ్రీరావులమ్మ తీర్థం జరిగింది. అంబాజీపేట మండలం ఇరుసుమండ గ్రామానికి చెందిన దొమ్మేటి గంగాభవాని గంగలకుర్రు అగ్రహారం బంధువుల ఇంటికి వచ్చింది. మంగళవారం రాత్రి అమ్మవారిని దర్శించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో హైస్కూల్ సమీపంలోని కనక దుర్గమ్మ ఆలయ సమీపంలోకి వచ్చేసరికి చీకటి ప్రాంతంలో మోటార్‌సైకిల్ ఇద్దరు వ్యక్తులు వచ్చి మహిళ మెడలో ఉన్న సుమారు రూ.3 లక్షలు విలువైన 4 కాసుల బంగారు సూత్రాల తాడు దొంగలించుకుపోయారు. దీంతో ఆమె కేకలు వేయడంతో స్థానికులు దొంగలను వెంబడించినప్పటికి మోటార్‌సైకిల్‌పై పారిపోయారు. విషయాన్ని పోలీసులకు వివరించడంతో ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి, ఎస్‌ఐ కె.చిరంజీవి సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితురాలు గంగాభవాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

అత్తతో గొడవపడి కోడలు ఆత్మహత్య


సౌమ్య మృతదేహం

కరప/యానాం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అత్తతో గొడవపడి క్షణికావేశంలో ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన వివాహిత యానాం- ఎదుర్లంక బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వివరాల్లోకి వెళితే.. కాకినాడ జిల్లా కరప మండలం కొంగోడు గ్రామానికి చెందిన ఆట్ల సౌమ్య(23)కు రెండేళ్ల క్రితం సుబ్బరాజుతో వివాహం కాగా వారికి ఒక పాప ఉంది. మంగళవారం అత్తతో సౌమ్య గొడవపడి ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. కంగారుపడిన కుటుంబసభ్యులు అదేరోజు రాత్రి కరప పోలీసులకు ఫిర్యాదుచేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. అయితే బుధవారం యానాంలోని గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్టు అక్కడి పోలీసుల నుంచి కరప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందింది. దీనిపై మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తూ అత్తింటి వేధింపుల కారణంగా సౌమ్య మృతిచెందిందని మృతదేహంతో కరప పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించారు. మృతురాలికి న్యాయం చేయాలని నిరసన చేపట్టారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్‌ఐ తోట సునీత ఇరువర్గాలతో చర్చించారు. మృతురాలి బంధువులకు పాపను అప్పగించి, 5 కుంచాల పొలాన్ని రాసివ్వడానికి భర్త తరపు పెద్దలు ఒప్పుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

కుటుంబాన్ని భార్య పట్టించుకోవట్లేదని కొడుకు, కూతురితో భర్త ఆత్మహత్యాయత్నం

పురుగుల మందు తాగడంతో రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలింపు

మలికిపురం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం కేశనపల్లికి చెందిన ఒక కుటుంబం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. కేశనపల్లికి చెందిన పలివెల నాగేశ్వరరావు (50) తన భార్య లక్ష్మిని ఐదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన కువైట్‌కు పంపాడు. నాగేశ్వరరావుకు పదో తరగతి చదివే కుమారుడు సుమన్, 8వ తరగతి చదివే కుమార్తె ప్రశాంతి ఉన్నారు. భార్య గల్ఫ్ దేశానికి వెళ్లడంతో తన పరిస్థితి మరింత మెరుగవుతుందని ఆశించారు. కూలి పనులు చేసుకునే నాగేశ్వరరావు తమ పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వవచ్చని ఆశించాడు. కానీ కువైట్ వెళ్లిన లక్ష్మి తన కుటుంబాన్ని పట్టించుకోవడం మానేసింది. ఒకరోజు కాకపోతే మరోరోజు తమను పట్టించుకుంటుందనే ఆశతో ఆ కుటుంబమంతా ఎదురు చూసింది. ఐదేళ్లయినా లక్ష్మి భర్తను, పిల్లల్ని పట్టించుకోకుండా స్వదేశానికి తిరిగి రాకుండా వదిలివేయడంతో మనస్తాపం చెందిన నాగేశ్వరరావు బుధవారం ఉదయ ం పురుగలమందు తాగి తనతో పాటు కుమారుడు సుమన్ (15), కుమార్తె ప్రశాంతి (13)లకు కూడా పట్టించాడు. వీరంతా అపస్మారక స్థితికి వెళ్లడంతో ఇరుగుపొరుగు వారు పట్టించుకుని రాజోలు ప్రభుత్వాసుపత్రికి చికిత్స కోసం తరలించారు. రాజోలు ప్రభుత్వాసుపత్రిలో వీరు ముగ్గురు చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై పోలీసులను వివరణ కోరగా తమకు ఏ ఫిర్యాదు అందలేదని తెలిపారు.

రంపచోడవరంలో మహిళ ఆత్మహత్యాయత్నం

సకాలంలో స్పందించి కాపాడిన పోలీసులు


ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళను భర్తకు అప్పగిస్తున్న పోలీసులు

రంపచోడవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలో ఓ మహిళ భూపతిపాలెం రిజర్వాయర్‌లో దూకి ఆత్మహత్యా చేసుకునే ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకుని ఆమెను కాపాడిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. రంపచోడవరానికి చెందిన గుబ్బల చంద్రా వతి(40) తనకు కలిగిన ఇల్లు, ప్లాస్టిక్ సామాన్లు అమ్మే షాపును ఆక్రమణల తొలగింపులో భాగంగా కూల్చేయడంతో తీవ్ర నష్టానికి గురయ్యామన్న మనస్తాపంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. రంపచోడవరం శివారులో ఉన్న భూపతిపాలెం ప్రాజెక్టు వద్దకు మంగళవారం రాత్రి వెళ్లి అందులో దూకేందుకు సిద్ధమవుతుండగా సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఆమెను నిలువరించి ఆత్మహత్యకు పాల్పడకుండా అడ్డుకున్నారు. అనంతరం కౌన్సిలింగ్ ఇచ్చి భర్తకు అప్పగించారు.

చెరువులో పడి మేకల కాపరి మృతి


కుటుంబరావు మృతదేహం

నల్లజర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా పోతవరం గ్రామానికి చెందిన మేకల కాపరి జువ్వాల కుటుంబరావు (55) బుధవారం పాత ఊరు చెరువులో పడి మృతిచెందాడు. స్థానికులు తెలిపి వివరాల ప్రకారం.. కుటుంబరావు చెరువు సమీపంలో మేకలను మేపుతుండగా ఫిట్స్ రావడంతో అందులో పడిపోయాడు. ఎవరూ గమనించక పోవడంతో మృతిచెందాడు. సాయంత్రం చెరువు గట్టుపై నుంచి వస్తున్న రైతులకు మృతదేహం కనిపించడంతో గుర్తించి ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఘటనపై పోలీసు కేసు నమోదు కాలేదు.

రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ.. యువకుడి మృతి


వీరబాబు (ఫైల్)

జగ్గంపేట రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా జగ్గంపేట మండలంలోని వెంగయమ్మపురం గ్రామ శివారున జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. వెంగయమ్మపురానికి చెందిన వీరబాబు(32) మోటార్‌సైకిల్‌పై మల్లిసాల వెళ్లి తిరిగి వెంగయమ్మపురం వస్తున్నాడు. మార్గమధ్యలో జ్యూస్ ఫ్యాక్టరీ వద్దకు వచ్చేసరికి రామవరం గ్రామానికి చెందిన మండపాక చిన్న మోటార్‌సైకిల్‌పై మల్లిసాల వైపు వెళ్తున్నాడు. జ్యూస్ ఫ్యాక్టరీవద్ద వీరు బైక్‌లు ఎదురెదురుగా బలంగా ఢీకొన్నాయి. వీరబాబు తలకు బలమైన గాయం కాగా జగ్గంపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రమాదంలో గాయపడిన మండపాక చిన్నాకు కాలు ఫ్యాక్చర్ కావడంతో వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్టు సమాచారం.

సినీ దర్శకుడు సుకుమార్ పరామర్శ


సత్యవతి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సుకుమార్ కుటుంబీకులు

ద్రాక్షారామ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మాతృవియోగంతో పొందిన పీఆర్ ప్రాజెక్టు డీఈఈ అన్యం రాంబాబును సినీ దర్శకుడు సుకుమార్ బుధవారం రాత్రి కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం వెలంపాలెంలో పరామర్శించారు. డీఈఈ మాతృమూర్తి సత్యవతి ఇటీవల వయోభారంతో మృతిచెందారు. దీంతో రాంబాబు స్నేహితుడైన సుకుమార్ తన భార్య తబిత, అక్క లక్ష్మీ, బావ బ్రహ్మాజీలతో కలసి వెలంపాలెం చేరుకున్నారు. రాంబాబును ఓదార్చారు. సత్యవతి చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అదేవిధంగా రాంబాబును బుధవారం మాజీ మంత్రి పినిపే విశ్వరూప్, నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాష్ పరామర్శించారు.

'లోవ'కు రూ.2 లక్షల విరాళం


దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

తుని రూరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానంలో ఆలయ పునఃనిర్మాణ పనులకు విజయవాడకు చెందిన గంధం రాజేష్‌కుమార్, కాసులదేవి దంపతులు రూ.2 లక్షల విరాళాన్ని ఆలయ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. వారికి ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనాలు, అమ్మవారి మహాప్రసాదం అందజేశారు.


విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ

రాక్షస పాలన నుంచి విముక్తి పొందాం

- సుపరిపాలన మొదలై ఏడాది
- కూటమి విజయోత్సవ ర్యాలీ
- బూరుగుపూడి వద్ద దిష్టి బొమ్మలు దహనం
- నరసింహస్వామి కొండవద్ద దీపాలు వెలిగించిన మహిళలు

కోరుకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి):రాష్ట్రానికి, రాజానగరం నియోజకవర్గానికి రాక్షస పాలన పీడ విరగడై ఏడాది గడిచిన సందర్భంగా బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో కోరుకొండ మండలంలోని దోసకాయలపల్లి, బూరుగుపూడి, జంబుపట్నం, కాపవరం, కోరుకొండ గ్రామాల్లో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. రాత్రి 8గంటలకు బూరుగుపూడి అయ్యన్నగళ్ళవద్ద నరకాసురుడు, తుగ్లక్‌దిష్టి బొమ్మలను ఏర్పాటుచేసి వాటి దహన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ బైక్ ర్యాలీగా లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారి గుడిమెట్లకు ప్రత్యేక దీపాలు వెలిగించారు. భారీగా బాణా సంచాకాల్చారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం అని రైతు బిడ్డగా గర్వపడుతున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లగా కూటమిపాలన సాగుతుందన్నారు. గత వైసీపీ పాలనలో సాగునీటికోసం, ధాన్యం కొనుగోలుకోసం, ఖాళీ సంచుల కోసం ధ్యానం డబ్బు లు చెల్లింపు కోసం రైతులు కన్నీరు పెట్టుకుని ఆత్మహత్య చేసుకున్నారన్నారు. తమ ప్రభుత్వం ప్రతి ఎకరాకు సాగునీరు అందించి ప్రతి ధా న్యం గింజ కొనుగోలుచేసి డబ్బు చెల్లించామన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం ద్వారా మహిళలకు 3గ్యాస్ సిలిండర్లు అమలు చేశామన్నారు. నాణ్యమైన లిక్కరును నరసమైన ధరలకు విక్రయిస్తున్నామన్నారు. పలువురు జనసైనికులు, వీరమహిళలు, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ధవళేశ్వరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి సుపరిపాలన మొదలై సంవత్సర కాలం పూర్తికావడంతో జనసేన ఆధ్వర్యంలో బుధవారం సంబరాలు నిర్వహించారు. జనసేన నాయకుడు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో స్థానిక రథం వీధిలో సాయంత్రం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. దక్షిణ మండలి డీఎస్పీ భవ్య కిషోర్ విచ్చేసి మహిళలు వేసిన ముగ్గులు పరిశీలించారు.

సిద్ధివినాయకుడి ఆలయ పునర్‌నిర్మాణానికి

ఆదిరెడ్డి కుటుంబం విరాళం


అన్నపూర్ణమ్మపేట సిద్ధి వినాయక స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన ఆదిరెడ్డి కుటుంబం

రాజమహేంద్రవరంకల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక అన్నపూర్ణమ్మపేటలో శ్రీసిద్ధి వినాయకస్వామి ఆలయం పునర్నిర్మాణానికి, రాజమహేంద్రవరంసిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే భవాని, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు,వీరరాఘవమ్మ దంపతులు వారి కుటుంబం తరఫున రూ.13లక్షలు విరాళంగా అందజేశారు. ఆలయ పునర్నిర్మాణ ప్రారంభోత్సవం సందర్భంగా బుధవారం నుంచి హోమాలు, నవగ్రహ శాంతి హోమాలు, గణపతిపూజ, స్వామివారి ఊరేగింపు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఆయా కార్యక్రమాలకు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు కుటుంబం హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఆలయ పునర్నిర్మాణం తమ కుటుంబం చేతుల మీదుగా జరగడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, అలయ కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు మాలే విజయలక్ష్మి, శనిపతి సత్తిబాబు, మీసాల నాగమణి, వీరా రా ము, కీలపర్తి నాగభూషణం, నాగలక్ష్మి, ఆర్‌సత్తిబాబు, బాబు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని భ్రష్టు పట్టిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే


కోటగుమ్మం సెంటర్‌లో ర్యాలీ చేస్తున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగాన్ని కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. ఏఐసీసీ పిలుపుమేరకు బుధవారం రాజమహేంద్రవరంలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కోటగుమ్మం నుంచి ఫ్రూట్ మార్కెట్ వరకు సాగిన ఈ ర్యాలీలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లాకాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి తొలుత వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం టీకే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం డాక్టర్ బీ ఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగాన్ని పక్కన పెట్టి చేస్తున్న కుట్రలను ప్రజలంతా తిప్పికొట్టాలని పిలుపునిచ్చా రు. అన్ని నియోజకవర్గాలలో రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈసందర్భంగా మెయిన్‌రోడ్డులో వ్యాపారులను కలిసి రాజ్యాంగ పరిరక్షణ కార్యక్రమం కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ఉపాధ్యక్షుడు మార్టిన్ లూథర్, నగర అధ్యక్షుడు అబ్దుల్లాషరీఫ్, ప్రచార కమిటీ చైర్మన్ డాక్టర్ వడయార్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మోతా శారద, రూరల్ కోఆర్డినేటర్ తడాల కొండరాజు, రాజానగరం కోఆర్డినేటర్ శ్రీనివాస్ వడయార్, నిడదవోలు కోఆర్డినేటర్ కారంకి వెంకటేశ్వరరావు, సిటీ అధ్యక్షుడు మేడవరపు భద్రం దొర, పీసీసీ సెక్రటరీ చిన్నం మురళీకృష్ణ, కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాకర్ల శ్రీహరి, కాంగ్రెస్ పార్టీ జిల్లా దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు విజయ దుర్గారెడ్డి, పీసీసీ సభ్యులు పాలొన్నారు.

రాజమహేంద్రి వైభవాన్ని చాటిన ఆరుద్ర

రాజమహేంద్రవరంకల్చరల్ జూన్ 4(ఆంధ్రజ్యోతి):అద్భుతమైన సినీ గీతంతో, రాజమహేంద్రి వైభవాన్ని దశదిశలా వ్యాపింపజేసిన ఘనత ఆరుద్రదేనని రాజమహేంద్రి కళాశాల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. రాజమహేంద్రి కళాశాలలో బుధవారం ఆంధ్ర కేసరి యువజన సమితి పూర్వాధ్యక్షుడు దేశిరెడ్డి బలరామనాయుడు అధ్యక్షతన జరిగిన ఆరుద్ర 27వ వర్ధంతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విశ్వేశ్వరరెడ్డి, సమితి సభ్యులు ఆరుద్ర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాజమహేంద్రి ఘనకీర్తిని చాటే అమర నాదంలా శోభిల్లే రాజమహేంద్రి అనే గీతాన్ని రచించి నగర పురప్రజల హృదయాలలో ఎప్పటికీ నిలిచిపోయారన్నారు. సమితి కన్వీనర్ మాదిరాజు శ్రీనివాస్ మాట్లాడుతూ అభ్యుదయ కవిగా, పరిశోధకుడిగా సమాజానికి ఆయన జీవితం దారపోశారని తెలిపారు.

విరగడైన సైకోపాలన

- ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- లక్ష్మీగణపతి ఆలయంలో వేడుకలు


బిక్కవోలు లక్ష్మీగణపతిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

బిక్కవోలు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో చేసిన సత్య ప్రమాణం రుజువైన సందర్భంగాను, రాష్ట్రంలో సైకో పాలన విరగడై యేడాది పూర్తయిన సందర్భంగా బుధవారం బిక్కవోలు లక్ష్మీగణపతి ఆలయంలో ఘనంగా వేడుకలను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కూటమినేతలు నిర్వహించారు. ముందుగా ఆయన కుటుంబ సభ్యులు మహాలక్ష్మి, మనోజ్, డాక్టర్ సనాతనిలు, కూటమి నేతలతో కలసి ర్యాలీగా వచ్చి లక్ష్మీగణపతిని దర్శించి ప్రత్యేక పూజలు జరిపారు. కూటమి నేతలు ఏర్పాటుచేసిన కేకు కట్‌చేసి అందరికీ అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 23 డిసెంబరు 2020న లక్ష్మీగణపతి ఆలయంలో అప్పటి ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు, తాను సతీసమేతంగా సత్య ప్రమాణాలు చేశామని ఆప్రమాణాలు రుజువు కావడంతో గత యేడాది జూన్ 4న అనపర్తి ప్రజలు తనను ఎమ్మెల్యేగా గెలిపించి, సూర్యనారాయణరెడ్డిని ఇంటికి పంపారన్నారు. రాష్ట్రంలో సైకో పాలనను భరించలేక ప్రజలు జగన్ ప్రభుత్వానికి చరమగీతం పాడారన్నారు. వైసీపీ నేతలు నాటి జూన్ 4ను వెన్నుపోటు దినంగా నేడు నిర్వహించుకోవడం సిగ్గుచేటని ఎమ్మెల్యే అన్నారు. ఎంపీపీ తేతలి సుమ, కూటమి నేతలు కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, పాలచర్ల చిట్టిబాబు చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, గొర్రెల త్రిమూర్తులు, తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, చింతా శ్రీనివాసరెడ్డి, రెడ్డి శ్రీను, బేరా వేణమ్మ, నడింపిల్లి చిరంజీవిరాజు, చెల్లే జోష్‌బాబు, తనుకు శ్రీధర్, మోహన్, కుమార్, ఓవి. కృష్ణ, వడ్లమూరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బలభద్రపురంలో సైకో విముక్త ఏపీ దినం

ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని చిందర వందర చేసి సైకో పాలన చేసిన వైసీపీ ఎన్ని పాట్లు పడినా ప్రజల అభిమానాన్ని పొందడం అసాధ్యమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారంనాటికి కూటమి విజయం సాధించి ఏడాది పూర్తయిన సందర్భంగా బిక్కవోలు మండలం బలభద్రపురంలోని ఎంఎస్ఆర్ కళ్యాణ మండపంలో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్ రెడ్డి అధ్యక్షతన సైకో విముక్త ఏపీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్లపాటు రాష్ట్ర ప్రజలను మభ్యపెడుతూ పాలన సాగించిన జగన్‌రెడ్డికి ప్రజలు గుణపాఠం చెప్పారని అయినా ఆయన లో నేటికీ మార్పురాలేదన్నారు. అనంతరం కూటమి నేతల సమక్షంలో ఎమ్మెల్యే నల్లమిల్లి కేక్‌కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, ఆళ్ళ గోవిందు, జుత్తుగ సూర్యకుమారి, నాలుగు మండలాల టీడీపీ, బీజేపీ, జనసేన అధ్యక్షులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రంగంపేట: సైకో విముక్త ఏపీ దినం సందర్భంగా బుధవారం టీడీపీ జిల్లా ప్రధానకార్యదర్శి ఆళ్ళ గోవిందు ఆధ్వర్యంలో రంగంపేట మండలంలోగల అన్ని గ్రామాల్లో ఎన్డీయే కూటమి నాయకులు కేక్ కట్‌చేసి హర్షం వ్యక్తం చేశారు. వడిశలేరు, రంగంపేట, ఎస్టీరాజా పురం, చంద్రేడు, కోటపాడులో సంబరాలు జరుపుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆదేశాల ప్రకారం మర్రెడ్డి శ్రీనివాస్, రావాడ నాగు, జనసేన మండల అధ్యక్షు డు గిరజాల సత్తిబాబు ఆధ్వర్యంలో కోటపాడులో రంగవల్లులు, పోటీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మాచిన వెంకన్నదొర, బుల్లిదొర, ఉండవిల్లి గిరిబాబు, పోతుల చిన్నికాపు, గారపాటి రాంబాబు, వి.మాణిక్యం, మండవిల్లి గుప్త పాల్గొన్నారు.

కూటమి నేతల సంబరాలు

అనపర్తి: బిక్కవోలు లక్ష్మీ గణపతి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చేసిన సత్య ప్రమాణాలు గత ఏడాది జూన్ 4న రామకృష్ణారెడ్డి విజయంతో ప్రమాణాలు నిజమై ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం అనపర్తిలో


ఎన్టీఆర్, మూలారెడ్డి విగ్రహాలకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

కూటమి నేతలు సంబరాలు జరుపుకున్నారు. స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌లో ఏర్పాటు చేసిన కేక్‌ను ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కట్ చేసి పార్టీ నేతలకు తినిపించారు. భారీ బాణా సంచాతో సందడి చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిమ గలిగిన లక్ష్మీ గణపతి ప్రమాణాలకు ఫలితం చూపారని అన్నారు. అభిమానులు తెచ్చిన గణపతి విగ్రహానికి ఎమ్మెల్యే, కూటమి నాయకులు క్షీరాభిషేకం చేశారు.

మంచి వైద్యం అందించడానికి కృషి చేస్తున్నాం

- సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



ప్రభుత్వ బోధనాసుపత్రికి వైద్య పరికరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసు, రూరల్ ఎమ్మెల్యేను కలిసిన ఆర్టీసీ జిల్లా అధికారి మూర్తి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పేదలకు మెరుగైన, మంచి వైద్యసేవలు అందజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తున్నదని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రికి ఏపీ పేపర్‌మిల్లు యాజమాన్యం సీఎస్ఆర్ నిధులు రూ.70లక్షలతో సమకూర్చిన అత్యాధునిక సూపర్‌స్పెషాలిటీ వైద్యపరికరాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రభుత్వ బోధనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు మెరుగయ్యాయని, సీఎస్ఆర్ నిధులతో అత్యాధునిక సౌకర్యాలు సమకూరుతున్నాయన్నారు. గత వైసీపీ ఐదేళ్ల ప్రభుత్వ హయాంలో రూ.2.80 కోట్ల సీఎస్ఆర్ నిధులు మాత్రమే తీసుకొస్తే, తాను ఈ ఏడాదిలోనే రూ.70 లక్షలు సాధించానని వెల్లడించారు. మొత్తం రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గానికి రూ.3.85 కోట్ల సీఎస్ఆర్ నిధులు తేవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఏపీ పేపర్‌మిల్లు ఈడీ ముఖేష్ జైన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మీ సూర్యప్రభ, ఆర్ఎంవో సుబ్బారావు, కూటమి నాయకులు, వైద్యులు, నర్సింగ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలను కలసిన ఆర్టీసీ జిల్లా అధికారి మూర్తి

ఆర్టీసీ జిల్లా అధికారిగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన వైఎస్ఎన్ మూర్తి బుధవారం రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరిలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేలకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. జిల్లా అధికారిగా ఆర్టీసీ సంస్థ పురోభివృద్ధికి తాను కృషిచేస్తానని, తమవంతు సహాయ సహకారాలు అందజేయాల్సిందిగా ఈ సందర్భంగా ఆయన ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్బం, పలువురు ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

'ముఖ హాజరు తప్పనిసరి'

సీతానగరం,జూన్ 4 (ఆంధ్రజ్యోతి) కుట్టు శిక్షణ కార్యక్రమంలో పాల్గొనే మహిళలకు ముఖహాజరు (ఫేషియల్ అటిండెన్స్) తప్పనిసరిగా తీసుకోవాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎ.శ్రీనివాస్ సూచించారు. బుధవారం సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో జరుగుతున్న కుట్టు శిక్షణా కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ తీసుకునే మహిళల ముఖ హాజరు ప్రాముఖ్యతను తెలిపారు. 75 శాతం హాజరు ఉంటే సర్టిఫికెట్‌తోపాటు కుట్టు మిషన్ అందిస్తారని తెలిపారు. ఎంపీడీవో ఎం.భారతి కుట్టు శిక్షణ వివరాలను తెలిపారు. తొంబై రోజులు జరిగే ఈ శిక్షణా కార్యక్రమంలో రెండు బ్యాచ్‌లు ఉన్నాయని మొదటి బ్యాచ్ 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రెండో బ్యాచ్ మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతోందన్నారు. కార్యక్రమంలో ఏవో సుబ్రహ్మణ్యం సీనియర్ అసిస్టెంట్ గోపాల్ టైపిస్ట్ సతీష్ పాల్గొన్నారు.

23 నుంచి జీజీయూలో ఎఫ్‌డీపీ ప్రారంభం

రాజానగరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయు), మెకానికల్ ఇం జనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏఐసీటీఈ సౌజ న్యంతో ఈనెల 23నుంచి 28వ తేదీ వరకు అంతర్గత దహన ఇంజిన్ (ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్)పై ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఎఫ్‌డీపీ) నిర్వహించనున్నట్లు గైట్ ప్రిన్సిపాల్ టి.జయానంద్ కుమార్ తెలిపారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో జీజీయూ ఛాన్స లర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా టి.జయానంద్ కుమార్ మాట్లాడుతూ ఈకార్యక్రమం నిర్వహణకు ఏఐసీటీఈ రూ.3.50లక్షలు నిధులు మంజూరు చేసినట్లు చెప్పారు. మెకానికల్ విభాగం అధ్యాపకులు ఆలపాటి బాబ్జి కోఆర్డినేటర్‌గా, గైట్ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్ ఎం.మణికంఠ కో-కోఆర్డినేటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తారన్నారు. ప్రఖ్యాత సంస్థల నుంచి రీసోర్స్ పర్సన్లు హాజరై వివిధ సాంకేతిక అంశాలపై అవగాహన కల్పిస్తారని విభాగాధిపతి వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కార్యక్రమంలో జీజీయు వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రో వైస్ ఛాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాళ్లు ఎంవీఎస్ బాబు, ధనరాజు, వల్లీ మాధవి, పి.వి.రామానుజం, సలహాదారు శిశిర్‌సాహా డీన్లు పాల్గొన్నారు.

మహిళకు జనసైనికుల సాయం

కడియం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో ఉన్న వారిని ఆదుకోవడమే జనసేన లక్ష్యమని ఆపా ర్టీ నాయకులు ఆదిమూలం సాయిబాబా తెలిపారు. వీరవరం గ్రామంలో దొడ్డవరపు సత్యవతి భర్త సత్యనారాయణ ఇటీవల మృతి చెందారు. వారు ఉండే తాటాకిల్లు మొత్తం కూలిపోయింది. దీంతో జనసేన నాయకులు ఆదిమూలం సాయిబాబా ఆధ్వర్యంలో బుధవారం జనసైనికులు నెలకు సరిపడే నిత్యావసర వస్తువులు, సామగ్రి, నగదు, బియ్యం అందజేశారు. కార్యక్రమంలో ఆదిమూలం సాయిబాబా, కొవ్వల నాని, మోతుకూరి రాము, కేదారి శ్రీను, పట్టపు బ్రదర్స్, కేబుల్ నాగు, మార్కండేయ, నాగు పాల్గొన్నారు.


వీరవరంలో మహిళకు సాయం చేస్తున్న జనసైనికులు

'పథకాల అమలులో రైతులకు సాంకేతిక అవగాహన కల్పించాలి'

రాజమహేంద్రవరంరూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పథకాల అమలులో రైతులకు సాంకేతిక అవగాహన కల్పించాలని కలవచర్ల కృషి విజ్ఞానకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ వీఎస్‌టీ నాయుడు తెలిపారు. రూరల్ మండలం రాజవోలులో బుధవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీఏఆర్, వ్యవసాయశాఖ ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డ్రోన్ వినియోగం, నవధాన్యాల సాగు మట్టిలో పోషక విలువలను గుర్తించి తద్వారా ఎరువుల వాడకం, పంటల ఎంపిక తదితర విషయాలపై శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. పీఎం కిసాన్, ఫసల్‌బీమా, ఆర్వేవీవై, ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఎరువు లు, పురుగుమందులు సమర్థవంతంగా పిచికారీ విధానాన్ని ఇఫ్కో, కోరమాండల్ సాంకేతిక సిబ్బంది వివరించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. సరళ, డా. శిరీష, వ్యవసాయాధికారి బీమరాజు, ఆత్మ బీటీఎం రాజశేఖర్, ఏఈవోలు పీటర్, ప్రభుదర్శన్, వేణుమాధవరావు, వీఏఏలు దుర్గాబాబు, రాహుల్ రైతులు పాల్గొన్నారు.

పుష్కరవనంలో యోగాంధ్ర కార్యక్రమం

రాజానగరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): యోగాంధ్ర 2025లో భాగంగా ఆదికవి నన్నయ యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో పుష్కరవనంలో బుధవారం యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ ఆదేశాల మేరకు స్థానిక పర్యాటక ప్రదేశమైన పుష్కరవనంలో యోగాంధ్ర నిర్వహించామన్నారు. యోగాంధ్రపై అవగాహన కల్పించి, ఉద్యోగంలో ఒత్తిడిని అధిగమించే యోగాసనాలను నేర్పించారు. కానవరంలోని శ్రీరాపర్తి రామ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగ కేంద్రం నుంచి ఆన్ లైన్ ద్వారా విశ్వవిద్యాలయం తరఫున యోగాంధ్ర ప్రోగ్రాంను నిర్వహిస్తున్నట్లు వీసీ తెలిపారు. అందరికీ యోగా ప్రయోజనాలు అందించాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్, ఆఫ్ లైన్ విధానంలో యోగా కార్యక్రమాలు చేపట్టామన్నారు.

గాన గంధర్వుడు ఎస్పీ బాలు జయంతి



బాలసుబ్రహ్మణ్యం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సంగీతాభిమానులు

రాజమహేంద్రవరంకల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): భారతీయ చలనచిత్ర గాయకుడు, గాన గంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి స్థానిక గోకవరం బస్టాండువద్ద గల జిత్‌మోహన్ మిత్ర కళావేదికలో బుధవారం జరిగిన కార్యక్రమానికి శ్రీపాద జిత్‌మోహన్ మిత్ర అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచం గర్వించదగ్గ గాయకులలో బాలు ఒకరని, తన గాన మాధుర్యంతో 50 వేలకుపైగా పాటలు పాడి, నటుడిగా, నిర్మాతగా, సంగీత దర్శకుడిగా, వ్యాఖ్యాతగా అందరి మనసుల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. రాజమహేంద్రవరంలో తాను,బాలుతో కలిసి పలు సంగీత కార్యక్రమాలను నిర్వహించుకోవడం తన అదృష్టమని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్రమానికి ముద్రగడ ఏసుబాబు జ్యోతి ప్రజ్వలన చేయగా, పోస్టల్ ప్రసాద్ వ్యాఖ్యాతగా వ్యవహరించగా, డాక్టర్ గిరిజాల సోమరాజు నాయుడు వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో జల్లి శివప్రసాద్, పీవీఎస్ కృష్ణారావు,వి.జగపతి, సుక్కిరెడ్డి శ్రీనివాస్, గాయనీగాయకులు వంక బాలకృష్ణ, హేమ నళిని, జీవీఎస్ లక్ష్మీతులసి, ఆదిత్య, శేషగిరి, ఫణికుమార్, మార్కండేయులు బాలు పాటలతో స్వ ర నివాళులర్పించారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యంకు ఘన నివాళి

ధవళేశ్వరం: గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 79వ జయంతిని రాకా గోదావరి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఇరిగేషన్ పార్కులో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిత్రపటానికి జీవీ రమణ, యర్రమోతు ధర్మరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంధి జగన్నాథం, తాతారావు, మదర్సా ఆలీ, రాయుడు చంద్రశేఖర్, పీఎస్ శేషుకుమార్, ఎం. రమేష్, సంగీతాభిమానులు పాల్గొన్నారు.

కడియం: వేమగిరి సెంటర్‌లో బుధవారం ఘంటసాల అభిమాని ప్రత్తిపాటి నల్లరాజు ఆధ్వర్యంలో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సాయిరామ్ ఆటోయూనియన్ సభ్యులు, మర్రి సుబ్రహ్మణ్యం, బొర్రా సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు రైతులకు పంటలపై అవగాహన సదస్సు

రంగంపేట, జూన్4(ఆంధ్రజ్యోతి): రంగంపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు కేవీకే శాస్త్రవేత్తల ద్వారా, వికసిత్ కృషి సంకల్ప అభియాన్‌లో భాగంగా రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఎంపీడీవో సాయిబాబు తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమానికి అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారని ఆయన తెలిపారు.

ఎన్నికల హామీలు నెరవేర్చని కూటమి ప్రభుత్వం

రాజమహేంద్రవరంకల్చరల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ పేరుతో ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందని మాజీ ఎంపీ, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ధ్వజమెత్తారు. మాజీ ఎంపీ భరత్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా ర్యాలీని నిర్వహించి అనంతరం వైసీపీ జిల్లా పరిశీలకుడు తిప్పల గురుమూర్తిరెడ్డితో కలిసి మాజీ ఎంపీ భరత్ ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద వెన్నుపోటు దినం ర్యాలీ


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైసీపీ నాయకుడు వేణు

రాజమహేంద్రవరంరూరల్: రాజమహేంద్రవరంరూరల్ మండలం బొమ్మూరులోని జిల్లా కలెక్టర్ కార్యాలయంవద్ద వైసీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, యువ నాయకుడు జక్కంపూడి గణేష్, చందన నాగేశ్వర్‌లు భారీ బైక్ ర్యాలీ చేశారు. రూరల్ నియోజకవర్గంలోని వైసీపీ కార్యాలయంనుంచి వెన్నుపోటు దినం కార్యక్రమంలో ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకుని కొద్ది సేపు మెయిన్‌గేట్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ప్రశాంతికి మెమోరాండం అందించారు.

సూపర్ సిక్స్ అమలు కానందుకు నిరసన

కోరుకొండ: కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా ఇప్పటివరకు ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడం దారుణమని వైసీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా విమర్శించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా చంద్రబాబు చేసిన మోసాలు నిలదీస్తూ బుధవారం కోరుకొండలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు కదం తొక్కారు. కోరుకొండలోని జక్కంపూడి రాజా స్వగృహం నుంచి మూడు మండలాలల నుంచివైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, ఎంపీపీ ఉల్లి సూర్యకుమారి, నక్కా రాంబాబు, గంగిశెట్టి సోమేశ్వరరావు, బొరుసు బద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ 13వ బ్యాచ్ శిక్షణ పూర్తి

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపోలోని డ్రైవింగ్ స్కూల్‌లో 13వ బ్యాచ్ వారికి శిక్షణ పూర్తి చేసినట్లు డిపో మేనేజర్ షేక్ షబ్నం తెలిపారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న డ్రైవర్లకు బుధవారం సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణా అధికారి వైఎస్ఎన్ మూర్తి, ఆర్‌టీవో కార్యాలయం ఎంవీఐ సంపత్‌కుమార్ పాల్గొన్నారు.

గుండెపోటుతో శానిటేషన్ మేస్త్రి మృతి

కడియం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వేమగిరి పంచాయతీ శానిటేషన్ మేస్త్రి, కాంటాక్టు ఉద్యోగిగా చేస్తున్న పేర్ల సింహాచలం మంగళవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఇటీవల శానిటేషన్ మేస్త్రీలను గ్రామ కార్యదర్శి రూప్‌చంద్ తొలగించారు. సింహాచలం తన స్వంత ఊరు అయిన ధవళేశ్వరం నుంచి సైకిల్‌పై వేమగిరి వచ్చాడు. తొలగించినట్లు చెప్పడంతో స్థానికంగా ఉన్న పెద్దలను కలిశాడు. అయినా ఫలితం లేకపోవడంతో గుండెపోటుతో మృతి చెందినట్లు సింహాచలం బంధువులు తెలిపారు. సింహాచలం మరణవార్త తెలియడంతో పంచాయతీ కార్యదర్శి రూప్‌చంద్, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు సెలవు ప్రకటించినట్లు తెలిసింది.

వైభవంగా వెంకటేశ్వర స్వామి కల్యాణం

కోరుకొండ, జూన్4 (ఆంధ్రజ్యోతి): కోరుకొండలో శ్రీ భూసమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారంరాత్రి స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చక స్వాములు, ఆగమ బ్రహ్మలు కల్యాణం నిర్వహించారు.





కొవ్వూరులో కూటమి పాలన ఏడాది అయిన సందర్భంగా ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి





రాజమహేంద్రవరంలో ముగ్గుల పోటీ దృశ్యం.. దీపావళి వేడుకను తలపిస్తూ కాకరపువ్వొత్తులు కాలుస్తున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, గన్ని కృష్ణ, జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వై శ్రీనివాస్ తదితరులు


ఉత్సాహంగా సుపరిపాలన సంబరాలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా జిల్లావ్యాప్తంగా విజయోత్సవ వేడుకలు జరిపారు. ముఖ్యంగా జనసేన అధినేత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపుమేరకు రాజమహేంద్రవరంలో బుధవారం రాత్రి నందం గన్నిరాజు సెంటర్‌లో సుపరిపాలన సంబరాలు నిర్వహించారు. జనసేన కార్పొరేషన్ అధ్యక్షుడు వై శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూటమి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, ఏపీ టూరిజం డైరెక్టర్ గంటా స్వరూప, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి యర్రా వేణుగోపాలరాయుడు, జనసేన అనుశ్రీ సత్యనారాయణ సతీమణి అనురాధ,

దీపావళి, సంక్రాంతిని తలపిస్తూ వేడుకలు

బీజేపీ నాయకురాలు హారిక హజరయ్యారు. తొలుత సంక్రాంతిని గుర్తుచేస్తూ మహిళలకు ముగ్గుల పోటీ, బాణసంచా కాల్చి దీపావళి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ చీకటి పాలనకు చరమగీతం పాడుతూ ప్రజలు గతేడాది 4న ఓటు అనే ఆయుధంతో భూస్థాపితం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చుతూ ముందుకు సాగుతోందన్నారు. జనసేన అధ్యక్షుడు వై శ్రీనివాస్ మాట్లాడుతూ తమ నేత పవన్‌కల్యాణ్ పిలుపుమేరకు ఈ సంబరాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

'సహకార' రైతులపై ఉక్కు పిడికిలి!



- నిబంధనల పేరిట వడ్డీ రేటు పెంచేలా డీసీసీబీ ప్రణాళిక
- స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ దాటి రుణం పొందితే 11 శాతం వడ్డీ
- పంట రుణాలు మంజూరు చేయాలంటే ఫీల్డ్ విజిట్ తప్పనిసరి
- ఉత్తర్వులు జారీచేసిన డీసీసీబీ సీఈవో
- ఆందోళన చెందుతున్నరైతులు

వ్యవసాయ సాగులో ఇప్పటికే ఎన్నో ఇబ్బందులు పడుతున్నరైతులపై ఇప్పుడు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కూడా ఉక్కు పిడికిలి బిగించింది. నిబంధనల పేరిట వడ్డీ రేటును పెంచుతూ రైతులపై అధిక భారం మోపేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది. స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలకు విరుద్ధంగా అధిక మొత్తాల్లో రుణాలు పొందిన రైతుల నుంచి 7 శాతం వడ్డీకి బదులు 11శాతం వడ్డీ రేటును వసూలు చేయాలని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సీఈవో గతనెల 30న ఇచ్చిన సర్క్యులర్ ఇప్పుడు రైతుల్లో చర్చనీయాంశమైంది. వడ్డీ రేట్లను పెంచుతూ డీసీసీబీ ఇచ్చిన ఉత్తర్వులపై ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతులు ఆందోళనకు గురవుతున్నారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా కోట్ల రూపాయలను రుణాల రూపంలో తీసుకుని సొసైటీలను నిలువునా ముంచేయడంలో కొందరు ప్రజాప్రతినిధులు, సహకార సంఘాల నేతలు కీలక పాత్ర వహించడం వల్ల డీసీసీబీ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. దీంతో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నిబంధనలు వర్తింపచేయడం ద్వారా 11శాతం వడ్డీని వసూలు చేయాలని డీసీసీబీ సర్క్యులర్‌ను సొసైటీలకు జారీచేసింది. అలాగే పలు నిబంధనలను అమలులోకి తేవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

(అమలాపురం - ఆంధ్రజ్యోతి)

డీసీసీబీ బ్యాంకు పరిధిలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 298 సహకార సంఘాలు ఉన్నాయి. వాటిలో అత్యధికంగా కోనసీమ జిల్లాలో 166, తూర్పులో 49, కాకినాడలో 72, అల్లూరి జిల్లాలో 11 సొసైటీలు న్నాయి. గతంలో పాలకుల తప్పిదాలు, స్కామ్‌ల వల్ల కోట్ల రూపాయల నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు ఉన్నాయి. వీటితోపాటు జిల్లావ్యాప్తంగా ఉన్న సొసైటీల్లో కూడా రుణాల దుర్వినియోగంపై విచారణ కూడా జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో గతనెల 30న డీసీసీబీ ఒక సర్క్యులర్ జారీ చేసింది. 2025-26 సంవత్సరానికి బ్యాంకు ద్వారా సొంత భూములపై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కంటే అధికంగా పంట రుణాలు మంజూరుచేసిన రుణాల మొత్తానికి (ఏఎఎస్ఏవో) సంబంధించి ఈ ఉత్తర్వులు జారీచేశారు. వాస్తవానికి సొసైటీల ద్వారా వ్యవసాయదారులకు ఎంసీఎల్ పద్ధతిలో పంట రుణాలను మంజూరు చేస్తున్నారు. ఆప్కాబ్ నుంచి పంట రుణాలు మంజూరుచేసిన మొత్తానికి రాయితీ వడ్డీ రేటుకు రీఫైనాన్స్ చేయడం లేదు. కానీ బ్యాంకు ద్వారా సంఘానికి 5.75శాతం వడ్డీకి పంట రుణాలు మంజూరు చేయడంవల్ల రైతు కేవలం 7 శాతం వడ్డీరేటుకి రుణం మంజూరు చేస్తారు. సకాలంలో రుణం తిరిగి చెల్లించిన రైతులకు 3శాతం వడ్డీ రాయితీ కేంద్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. కానీ ఈ వడ్డీ రాయితీ కేంద్రం నుంచి జమకావడం లేదని సమాచారం. సొసైటీల పరిధిలో రైతులకు ఉన్న సొంత భూములై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కన్నా ఎక్కువ మొత్తంలో పంటరుణాలు మంజూరు చేశారు. సొసైటీలు కంప్యూటరీకరణ పూర్తికావడంతో ఎంసీఎల్ పద్ధతిన రుణాలు మంజూరు చేయడం వల్ల గతంలో సొంత భూమిపై స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కంటే అధిక మొత్తాల్లో రుణాలు పొందినట్టు గుర్తించారు. అలా అధిక మొత్తాల్లో రుణాలు పొందిన వారికి ప్రభుత్వం ఇచ్చే వడ్డీ రాయితీగానీ, పంటల బీమా పథకంగానీ వర్తించదు. ఈ నిబంధనలు అమలు వల్ల ఖాతాదారుల అనుమతితో అడిషనల్ ఎస్ఏవోగా రుణాన్ని మార్పు చేయాల్సి ఉంది. ఆప్కాబ్ నుంచి రాయితీ వడ్డీ రేట్లకు రీఫైనాన్స్ రానందున కొత్త సభ్యులకు పంట రుణాలు మంజూరు చేయాలంటే స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌కు రుణాన్ని పెంపుదల చేయాలన్నా, ఎడిషనల్ ఎస్ఏవోగా సహకార సంఘాలకు 9.75 వడ్డీ రేటుకు, సంఘం ద్వారా మెంబర్లకు 11 శాతం వడ్డీరేటుకు పంట రుణాలు మంజూరు చేయాలన్నా కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది.

రుణం పొందాలంటే.. సవాలక్ష నిబంధనలు

రుణ ప్రణాళిక అమలులో కచ్చితంగా నిబంధనలు పాటించాలని కాకినాడ డీసీసీబీ బ్యాంకు సీఈవో జారీచేసిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. పంట రుణానికి సంబంధించి ఎడిషనల్ ఎస్ఏవో వడ్డీరేటు 9.75శాతం(సహకార సంఘాలకు), 11శాతం సంఘం ద్వారా సభ్యునికి పీనల్ వడ్డీ 2శాతంగా నిర్ణయించారు. రుణ కాలవ్యవధిని ఏడాదిగా నిర్ణయించారు. వయోపరిమితి 15 నుంచి 65ఏళ్ల కలిగిన రైతులు వ్యక్తిగత రుణ పరిమితిని రూ.3 లక్షలకు పరిమితం చేశారు. షేర్ ధనాన్ని రుణం మొత్తంపై 10 శాతంగా నిర్ణయించారు. ఫిషరీస్ డైరీ ప్రయోజనాలకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పెట్టుబడి రుణాలు మంజూరుచేయాలి. రుణాలు మంజూరు చేసేటప్పుడు రైతుల నుంచి సొంత భూమికి సంబంధించి బ్యాంకు ఎస్ఏవో పాలసీలో పొందుపరిచిన అన్ని ముఖ్యపత్రాలతోపాటు ఇ-క్రాప్ సర్టిఫికెట్ తీసుకోవాలి. ఖాతాదారుల మార్ట్‌గేజ్ వివరాలు, డిక్లరేషన్ బాండ్ రిజిస్టర్‌లో పొందుపరిచి భద్రపరచాలి. సొసైటీల పరిధిలో సీఈవో, సూపర్‌వైజర్, రైతు సమక్షంలో ఫీల్డ్ విజిట్ చేసి రైతు పండించే భూములు, పంటలకు సంబంధించి జీపీఎస్ ఫొటోను తీసుకుని ఏఎస్ఏవో ఫైలు నందు ఇతర డాక్యుమెంట్లతో భద్రపరచాలి. షాడో రిజిస్టర్ నిర్వహించాలి. కొత్త సభ్యులకు పంట రుణాలు మంజూరు చేయాలంటే జూన్ నాటికి ఆ సంఘం పరిధిలో 80శాతం పైబడి పంట రుణాలు రికవరీ ఉంటేనే కొత్తరుణాలు మంజూరు చేయాలి. ఇలా డీసీసీబీ విధించిన తాజా ఆంక్షలతో అన్నదాతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.

నాలుగో రోజుకు 46.21% రేషన్

- అనపర్తిలో అత్యధికంగా 62. 30 శాతం
- గోపాలపురంలో అత్యల్పంగా 38. 87శాతం పంపిణీ
- 65 ఏళ్లు దాటిన వారందరికీ ఇంటి వద్దే పంపిణీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

రేషన్‌షాపుల వద్దే సరుకుల పంపిణీ ప్రజలకు ఆనందాన్ని కలిగిస్తోంది. మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎమ్మెల్యేలు, ఇతర అధికారులు అందరూ రేషన్ సరుకుల పంపిణీలో నిమగ్నమయ్యారు. 65ఏళ్ల దాటిన లబ్ధిదార్లకు స్వయంగా ఇళ్లకు తీసుకుని వెళ్లి సరుకులు ఇస్తున్నారు. జూన్ 1 నుంచి 4వ తేదీ వరకూ కేవలం 4 రోజుల్లో 46.21 శాతం సరుకులు పంపిణీ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇంటింటికీ సరుకులంటూ ఒక వాహనాన్ని పంపి వీధుల్లో నిలబెట్టి సరుకులిచ్చేవారు. పైగా ఏరోజు ఎక్కడికి వస్తుందో కూడా చెప్పలేని పరిస్థితి ఉండేది. కొన్ని ప్రాంతాలకు వచ్చేసరికి 15వ తేదీ దాటేసేది. ఇంతలో సరుకు అయిపోయిందని చెప్పే అనుభవాలు కూడా అనేకమందికి ఉన్నాయి. ఈ బాధలన్నీ తప్పి, పాత పద్ధతిలోనే డీలర్ షాపువద్దే సరుకులు ఇచ్చేటట్టు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో ఈనెల 1 నుంచి కొత్త విధానం అమలులోకి వచ్చిన సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేలే, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి శ్రేణులు పూర్తిగా జనంతో నిమగ్నమై రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 871 దుకాణాలు ఉన్నాయి. 5,64,994 బియ్యం కార్డులు ఉన్నాయి. వీటికి బియ్యం, పంచదార, కొన్నిచోట్ల కంది పప్పు ఇస్తున్నారు. 4వరోజు బుధవారం నాటికి 2,61,064 మంది కార్డుదారులకు రేషన్ షాపుల వద్ద సరుకులు ఇచ్చారు., 65ఏళ్ల దాటిన వారికి చాలావరకూ ఇచ్చేశారు. వాస్తవానికి 15వ తేదీ వరకూ సమయం ఉన్నప్పటికీ ముందుగానే అందరికీ పంపిణీ చేస్తామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి (డీఎస్‌వో) రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. రోజూ ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకూ సాయంకాలం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ రేషన్ షాపుల వద్ద సరుకుల సరఫరా చేస్తున్నామన్నారు. ఈ మధ్య ఖాళీ సమయంలో డీలర్లు, లేదా వారి కుటుంబ సభ్యులు గానీ 65 ఏళ్ల వయస్సు దాటిన వారి ఇళ్లకు వెళ్లి సరుకును డోర్ డెలివరీ చేస్తున్నట్టు చెప్పారు. ఇక జిల్లాలో మొత్తం 5,64,994 రేషన్‌కార్డులు ఉండగా, బుధవారం సాయంత్రం 6.30 గంటలకు 2,61,064 కార్డుదార్లకు రేషన్ పంపిణీ చేశారు. ఇది 46.21 శాతం. ఇక మండలాల వారీ చూస్తే గోపాలపురంలో 21128 కార్డులు ఉండగా, ఇప్పటికే 8213 మందికి పంపిణీ చేశారు. ఇది 38.87శాతం. నిడదవోలులో 34483 కార్డులు ఉండగా, ఇప్పటికే 13760 మందికి పంపిణీ చేశారు. ఇది 39.90 శాతం. ఉండ్రాజవరంలో 24135 కార్డులు ఉండగా, 9952 పంపిణీ చేశారు. ఇది 41. 23శాతం. పెరవలి మండలంలో 23,233 కార్డులు ఉండగా, 9592 మందికి పంపిణీ చేశారు. ఇది 41. 98శాతం. దేవరపల్లిలో 25416కార్డులు ఉండగా, ఇప్పటికే 10669 కార్డులకు పంపిణీ చేశారు. ఇది 41.98 శాతం. చాగల్లులో 21072 కార్డులు ఉండగా, 9129 మందికి పంపిణీ చేశారు. ఇది 43.32శాతం. రాజమహేంద్రవరం అర్బన్‌లో 83,403 కార్డులు ఉండగా, ఇప్పటికే 36,312 మందికి పంపిణీ చేశారు. ఇది 43.54 శాతం. నల్లజర్లలో 27554 కార్డులు ఉండగా, 12017మందికి పంపి ణీ చేశారు. ఇది 43.61శాతం. రంగంపేటలో 45.54 శాతం, గోకవ రంలో 45.59 శాతం, కొవ్వూరులో 33,320 కార్డులు ఉండగా, 15, 413 మందికి పంపిణీ చేశారు. ఇది 46.26 శాతం. బిక్కవోలు మండలంలో, 47.24 శాతం, కోరుకొండలో 47.60 శాతం, కడియంలో 48.38 శాతం, రాజానగరంలో 48.43 శాతం, రాజమహేంద్రవరం రూరల్‌లో 51.27 శాతం, సీతానగరం మండలంలో 52.21 శాతం పంపిణీ చేశారు. తాళ్లపూడి మండలంలో 22, 488 కార్డులు ఉండగా 9039 మందికి పంపిణీ చేశారు. ఇది 53.77 శాతం. అనపర్తిలో 62.30 శాతం పంపిణీ చేశారు. ఇక .జిల్లాలో సీనియర్ సిటిజన్‌లకు సంబంధించిన కార్డులు 65863 ఉండగా, ఇప్పటికి 28, 566 మందికి పంపిణీ చేశారు. ఇది 43.37 శాతం.



సత్యదేవా.. ఏమిటీ వైపరీత్యం?

- అన్నవరం దేవస్థానంలో ఇటీవల వరుస వివాదాలు
- ఆలయ ప్రతిష్ట మసకబారే ప్రమాదం
- కొందరు ఉద్యోగుల్లో బాధ్యతారాహిత్యం.. మరికొందరిలో నిర్లక్ష్యం

(ఆంధ్రజ్యోతి-అన్నవరం)

ఏ ఇంట శుభకార్యం జరిగినా ముందుగా గుర్తొచ్చేది అన్నవరం సత్యదేవుడి వ్రతం. ఈ ఆలయం రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా నిలిచింది. కానీ ప్రస్తుతం వరుస వివాదాలతో ఆలయ ప్రతిష్ట మసకబారే ప్రమాదం పొంచిఉంది. ఈ వివాదాలకు ప్రధాన కారణం కొందరు ఉద్యోగుల్లో బాధ్యతారాహిత్యం, మరి కొందరు విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడమే కారణం. దీనికితోడు సిబ్బందిని సమన్వయం చేసుకోవడంలో ఉన్నతాధికారులు విఫలమవుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ హయాంలో మితిమీరిన అవినీతి కనిపించినా వివాదాలు రచ్చకెక్కలేదు. గతేడాది రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉన్నతాధికారికి అవినీతి ఆనవాళ్లు లేకపోయినా అనుభవరాహిత్యంతో ఇతర విభాగాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారు. ఒక ఏఈవో దేవస్థానానికి జమచేయాల్సిన నగదు రూ.98 వేలు సొంతానికి వాడుకున్నాడు. ఇది రుజువుకావడంతో ఆ మొత్తం ఏఈవోతో దేవస్థానానికి జమ చేయించారు. ఇక రెండు వర్గాలుగా ఉన్న ఉద్యోగుల్లో ఎవరికి వారు పెత్తనం చెలాయించాలని చూసినా ఎవరికీ అవకాశం దక్కలేదు. ఆలయ వ్యవహారాల్లో ఈవో కుమారుడు పెత్తనం చేయడం అప్పట్లో ఈవో వెన్నంటి ఉండే ఒక సూపరింటెండెంట్ వ్యవహారశైలితో ఇబ్బందులు ఎదుర్కొన్న ఉద్యోగుల్లో కొందరు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ.. మరికొందరు సెలవు పెట్టడంతో వివాదం రాజుకుంది. దీనిపై పరిస్థితిని చక్కదిద్దేందుకు దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ విచారణ అధికారిగా అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ విచ్చేసి నివేదికను సమర్పించారు. ఇందులో ఈవో అవినీతికి పాల్పడలేదని, సిబ్బందిని సమన్వయం చేసుకోలేకపోయారని పొందుపరిచినట్టు సమాచారం. తదనంతరం భక్తుల సౌకర్యాల కల్పనలో అందుతున్న సేవలపై ప్రభుత్వం చేపట్టిన ఐవీఆర్ఎస్ సర్వేల్లో అన్నవరం దేవస్థానం చివరి స్థానానికి చేరడంతో ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా కలెక్టర్ నెలకొకసారి పర్యటించి పరిస్థితిని చక్కదిద్దారు. నీటి ఎద్దడి సాకుగా చూపించి దేవస్థానంలో మండు వేసవిలో భక్తులకు ఏసీ గదులు కేటాయించకుండా ఈవో తీసుకున్న నిర్ణయం వివాదాస్పదమైంది. వెంటనే కాకినాడ జిల్లా కలెక్టర్ కలుగజేసుకుని ప్రత్యామ్నాయ మార్గం వెతకాలని.. ఏసీ గదుల కేటాయింపు నిలుపుదల చేయడం సరికాదని సుతిమెత్తగా హెచ్చరించడంతో యథావిధిగా గదుల కేటాయింపు చేపట్టారు. సత్యదేవుడి కల్యాణోత్సవాల సమయంలో పలు ఆర్జిత సేవలను నిలుపుదల చేసిన సమయంలో వైదిక కమిటీ గతంలో నిర్వహించిన చండీ, ప్రత్యంగిర హోమాలను అదనంగా నిలుపుదల చేయడం వివాదాస్పదమైంది. దీంతో శృంగేరీపీఠాధిపతుల సూచనలతో ఏకీభవించి వారి అభిప్రాయం తీసుకోవాలని దానికి అనుగుణంగా నడుచుకోవాలని చైర్మన్ తెలపడంతో సద్దుమణిగింది. దేవస్థానంలో సేవ చేసేందుకు తెలంగాణ నుంచి విచ్చేసిన సేవా బృందంపై ఏఈవో దురుసుగా ప్రవర్తించడం తక్షణమే కొండ దిగి వెళ్లిపోవాలని లేకుంటే కేసులు పెడతామని హెచ్చరించడంతో విషయం వివాదాస్పదమైంది. దీంతో సేవకులకు అన్ని సౌకర్యాలు కల్పించి ఏఈవోకు షోకాజు నోటీసు జారీ చేశారు. సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాల్లో శ్రీపుష్పయోగం రోజున తన భార్యపై ఏఈవో అసభ్యకరంగా తాకి తోయడంతో నేరుగా ఆ భక్తుడు సీఎంవోకు ఫిర్యాదు చేయడంతో మరో వివాదం తెరమీదకొచ్చింది. దీంతో ఆ ఏఈవోను ఆలయ విభాగ బాధ్యతల నుంచి తప్పించి మరో విభాగానికి మార్చారు. రెండురోజుల కిందట సీఆర్వోలో గదులు ఖాళీలున్నా కేటాయించకపోవడంతో భక్తులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అర్ధరాత్రి ఈవో సీఆర్వో కార్యాలయానికి చేరుకుని భక్తులకు దగ్గరుండి గదులను ఇప్పించారు. దీనికి అక్కడ పనిచేసే కౌంటర్ గుమస్తాల నిర్లక్ష్యం కారణంగా బాధ్యులను చేస్తూ ఇద్దరిని సస్పెండ్ చేశారు.

క్షేత్ర స్థాయిలో తెలుసుకుంటేనే..

ఈవో క్షేత్రస్థాయిలో తిరగకుండా కేవలం సమీక్షలు, సమావేశాలతో పాలన సాగించడంతో ఈ వివాదాలు పెరుగుతున్నాయన్న విమర్శలున్నాయి. సిబ్బంది సైతం బాధ్యతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఉద్యోగుల జీతభత్యాలు, ఉద్యోగ విరమణ తర్వాత పెన్షన్లు అన్నీ.. దేవస్థానం ఖజానా నుంచి చెల్లించాలంటే భక్తుల పట్ల మర్యాదగా మెలగడం ద్వారా స్వామి సన్నిధిలోకి వివిధ రూపాల్లో ఆదాయం పెరుగుతుందని పలువురు సూచిస్తున్నారు.

నిషేధ సమయంలో ఇసుక తవ్వకాలకు అనుమతి ఇవ్వొద్దు : కలెక్టర్

- అక్రమ కార్యకలాపాలపై ప్రత్యేక బృందాల తనిఖీలు
- సీజ్ చేసిన ఇసుక గృహ నిర్మాణ పనులకు వినియోగం

రాజమహేంద్రవరం, జూన్4 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నిషేధ సమయంలో ఇసుక తవ్వకాలు జరపకూడదని, వాటిపై పర్యవేక్షణ అవసరమని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి డీఎల్ఎస్ఏ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 1నుంచి సెమీ మెకనైజ్డ్ రీచ్‌ల వద్ద ఇసుక తవ్వకాలు నిలిపివేస్తూ ఆదేశాలిచ్చామని, ఎవరైనా ఆయా ప్రాంతాల్లో ఇసుక తవ్వకాలు జరిపితే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయడంతోపాటు సీజ్ చేసిన వాహనాల నుంచి అపరాధ రుసుమ వసూలు చేయడమే కాకుండా సీజ్‌చేసిన ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద డంప్ చేసి ప్రభుత్వ నిర్మాణ, ఇళ్ల నిర్మాణ పనులకు వినియోగించాలని, వాటిపై నివేదిక కూడా ఇవ్వాలన్నారు. జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో విజిలెన్స్ బృంద సభ్యులతో ఆకస్మిక తనిఖీలు, దాడులు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన ప్రాంతాల్లో సమన్వయ శాఖల అధికారులతో కచ్చితంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌జీటీ మార్గదర్శకాలు కచ్చితంగా అమలుచేయాలని, ఎటువంటి మీమాంసకు తావులేదన్నారు. సీజ్ చేసిన ఇసుక ఎక్కడ డంప్ చేశారో వివరాలు చెప్పాలన్నారు. 19 కేసులు నమోదు చేసి, 10 కేసులపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని అధికారులు చెప్పగా, మిగతా కేసుల విషయంలో ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేయలేదో వివరణ ఇవ్వాలన్నారు. ఇక వర్షాకాలం దృష్ట్యా 9 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద డంప్ చేసినట్టు వివరించారు. జేసీ ఎస్. చిన్నరాముడు మాట్లాడుతూ ఇసుక రీచ్ నిర్వహణ, నిషేధ సమయంలో డీ సిల్టేషన్ అనుమతులు, సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌ల వద్ద కార్యకలాపాల్లో ఎటువంటి తవ్వకాలు జరగకూడదన్నారు. ఆర్డీవోలు ఆర్ కృష్ణ నాయర్, రాణి సుస్మిత, జిల్లా మైన్స్ అధికారి డి. ఫణిభూషణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పురోగతి బాధ్యత ప్రత్యేకాధికారులదే

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

రాజమహేంద్రవరం, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గృహనిర్మాణాల పురోగతిపై ప్రతీ వారం సమీక్షిస్తున్నామని, స్టేజి కన్వర్షన్ విధానంలో నిర్లిప్త చూపిస్తే ఉపేక్షించేది లేదని, పురోగతి బాధ్యత ప్రత్యేకాధికారులదేనని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి స్పష్టంచేశారు. బుధవాంర జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో డివిజన్, మండల స్థాయి ప్రత్యేకాధికారులతో గృహనిర్మాణ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్లు లేని ప్రతీ ఒక్కరి సొంత ఇంటి నిర్మాణంకోసం అదనపు ఆర్థిక సహాయం అందజేసేటపుడు ఆయా లబ్ధిదారులు ఇంటి నిర్మాణంలో ముందుకు వెళ్లేలా చూసి వారి అభిప్రాయాలను తీసుకున్న తర్వాతే అదనపు ఆర్థిక సహాయం చేశామన్నారు. రెండు దశల్లో నిర్మాణం నిర్ధారణ చేసుకున్న తర్వాతే అదనపు సహాయ నిధులు ఇచ్చామన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణం, వచ్చేవారం పురోగతిపై సమీక్షించాలని, ప్రతీ రోజూ ఉదయం క్షేత్ర స్థాయిలో పరిశీలనచేసి లబ్ధిదారుల వారీగా నివేదిక ఇవ్వాలన్నారు. జిల్లాలో 3,362 మందికి ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం చేశామని, వాటిలో 1165 ఇళ్ల నిర్మాణం చేపట్టగా, 912 ఇళ్లు పూర్తి చేశామన్నారు. ఇంకా 2222 గృహాలకు సంబంధించి స్టేజి కన్వెర్షన్‌పై దృష్టి పెట్టినట్టు చెప్పారు. నిర్మాణాల పురోగతిలో బాగా వెనుకబడి ఉన్న ఇద్దరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేయడానికి సిఫార్స్ చేయాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో అసలు మొత్తం 10,794 పేదల ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా, ఇప్పటి వరకూ 5,957 పూర్తి చేశామని, ఇది 55.18 శాతం అన్నారు. మిగిలిన వాటిలో 403 రూఫ్ పూర్తయ్యే స్థాయిలోనూ, 1255 రూఫ్ స్థాయిలోనూ, 2203 లింటల్ స్థాయిలోనూ, 5698 బేస్‌మెంట్ స్థాయిలోనూ ఉన్నాయన్నారు. అదనపు ఆర్థిక సహాయం పొందిన లబ్ధిదారులు త్వరగా ఇళ్లను పూర్తి చేయాలని తెలిపారు. మైగ్రేషన్ లేదా ఇంటి నిర్మాణం కోసం కొందరికి ఆసక్తి లేదనే వివరణ సరికాదని చెప్పారు. అనపర్తి, కొవ్వూరు, సీతానగరం మండలాలలో పురోగతి విషయంలో బాగా వెనుకబడి ఉన్నారన్నారు. వాటిని అధికమించడానికి కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. గత మూడు నెలలుగా కొన్ని ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణంలో పురోగతి లేకపోవడానికి ప్రత్యేకాధికారి, ఎంపీడీవోలు వ్యక్తిగత బాధ్యత వహించాలని, వారు నేరుగా సంప్రదిస్తే ఫలితాలు ఉంటాయని ఆమె స్పష్టంచేశారు. టేబుల్ వర్క్ కాకుండా క్షేత్ర స్థాయిలో లబ్ధిదారులతో మమేకం కావాలన్నారు. ఇన్‌చార్జి హౌసింగ్ పీడీ ఎస్.భాస్కరరెడ్డి మాట్లాడుతూ అదనపు ఆర్థిక సహాయంలో మొదలెట్టిన 3362 ఇళ్లలో 701 లింటల్ లెవల్, 464 రూఫ్ లెవల్, 49 రూఫ్ కంప్లీట్ స్థాయిలో ఉన్నాయన్నారు. రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఇళ్ల నిర్మాణంలో ఆశించిన పురోగతి లేకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తంచేశారన్నారు. మూడు నెలలుగా ఒక్క ఇల్లు కూడా కట్టకుండా రాబోయే పది రోజులలో పూర్తి చేస్తామని ఎలా చెప్పగలుగుతున్నారని ముఖ్యంగా ఆయన ప్రశ్నించినట్టు చెప్పారు. ఈ సమావేశంలో పీపీవో జేడీ ఎల్. అప్పలకొండ, డీఆర్డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కేఎన్ జ్యోతి, డీఎల్‌డీవో పి.వీణాదేవి, ఇతర శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

10న రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభం



టాటా ఇన్నోవేషన్ హబ్ సెంటర్‌ను పరిశీలించి సూచనలు చేస్తున్న కమిషనర్

రాజమహేంద్రవరంసిటీ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రూరల్ మండలం బొమ్మూరులో ఆర్డీఐహెచ్ భవనం ఏర్పాటుచేస్తున్న రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఈనెల 10న ప్రారంభిస్తున్నట్టు రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. బుధవారం ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు పనులను కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కమిషనర్ కేతన్ మాట్లాడుతూ గడువు తేదీ సమీపిస్తుండడంతో పనులు వేగంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించామన్నారు. రూ.75 లక్షల వ్యయంతో ఆర్డీఐహెచ్ భవనాన్ని సిద్ధం చేస్తున్నామన్నారు. రాత్రి పగలు వేగంగా పనులు జరుగుతున్నాయన్నారు. స్కిల్‌డవలప్మెంట్, ఇన్నోవేషన్ స్టార్టప్స్, ఫెసిలిటీ కేంద్రంగా ఈ ఇన్నోవేషన్ హబ్ పనిచేస్తుందన్నారు. రతన్‌టాటా స్ఫూర్తితో ప్రతి ఇంటి నుంచి ఒకరిని పారిశ్రామికవేత్తలుగా తయారుచేసి ఆయా కుటుంబాలను బాగుచేయాలన్నది ప్రభుత్వ ఆలోచన అని అన్నారు. ఆయన వెంట కార్పొరేషన్ ఎస్ఈ ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఈఈ మదర్సాఅలీ షేక్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారిణి వి.శాంతామణి, ఎంపీడీవో ఆంగ్రాంగ్ ఉన్నారు.

కొవ్వూరు

• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

సుపరిపాలనకు ఏడాది

టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో సంబరాలు

● పలుచోట్ల కేకులు కట్ చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు



కొవ్వూరు పట్టణంలో భోగి మంటను వెలిగిస్తున్న కూటమి నాయకులు

కొవ్వూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): నరకాసుర పాలనకు ప్రజలు చరమగీతం పాడి కూటమి ప్రభుత్వానికి అత్యధిక మెజార్టీ ఇచ్చారని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. వైసీపీ అరాచకపాలన అంతమై బుధవారంతో ఏడాదైన సందర్భంగా జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు ఆధ్వర్యంలో బుధవారం సుపరిపాలన సంబరాలు నిర్వహించారు. స్థానిక ఇందిరమ్మకాలనీ మెయిన్‌రోడ్డులో ఉదయం సంక్రాంతి , సాయంత్రం దీపావళి పండగను జరుపుకున్నారుఅనంతరం మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే భోగి మంటను వెలిగించారు. తర్వాత ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ పిలుపు మేరకు రాష్ట్రంలో వైసీపీఅరాచక పాలన అంతమైన నేపథ్యంలో కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, బీజేపీ నేతలు పరిమి రాధ, పిల్లలమర్రి మురళీకృష్ణ, బీవీ ముత్యాలరావు, జనసేన నాయకుడు, పట్టణ అధ్యక్షుడు డేగల రాము, కే. నవ్య, జిల్లా కార్యదర్శి మారిశెట్టి వెంకటేశ్వరరావు, అచ్యుతరాయుడు, ఎంపీటీసీ ఎరుబండి సురేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బుధవారం రాత్రి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో జనసైనికులు, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: రాష్ట్రంలో రాక్షస పాలన నుంచి ప్రజలకు విముక్తి కలిగి ఏడాది పూర్తి అయ్యిందని టీడీపీ, జనసేన పార్టీల మహిళా ప్రతినిధులు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని గాంధీనగర్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరమైన సందర్భంగా కేకు కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకురాలు సూర్యకాంతం, శాంతి, లక్ష్మి, కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: కూటమి ప్రభుత్వ పాలనకు సంవత్సరం పూర్తయిన సందర్భంగా మండలంలోని ఆయా గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. కానూరు, నడపల్లి, కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, పెరవలి, కాపవరం, కొత్తపల్లి, నల్లాకులవారిపాలెం , అజ్జరం, ముక్కామల, ఖండవల్లి, అన్నవరప్పాడు, మల్లేశ్వరం, పి. వేమవరంలో కేకులు కట్ చేశారు. కార్యక్రమంలో కంటిపూడి సూర్యనారాయణ, ప్రత్తిపాటి ప్రసాద్ కుమార్, సింహాద్రి సత్యనారాయణ, ఖండవల్లిలో జరిగిన కార్యక్రమంలో అతికాల శ్రీను, భూపతిరాజు రవివర్మ, తదితరులు పాల్గొన్నారు.

గోపాలపురం: సుపరిపాలనకు ఏడాది పూర్తయ్యిందని మాజీ ఎంపీటీసీ, ఏఎంసీ డైరెక్టర్ కూనపం ప్రసాద్‌బాబు, గ్రామకమిటీ అధ్యక్షుడు జ్యేష్ఠ శ్రీధర్ అన్నారు. గోపాలపురంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయి సందర్భంగా సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు చిత్రపటాలకు బుధవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమట శ్రీనివాస్, హుస్సేన్, భూరెడ్డి వాసు, చినవెంకటేశ్వరరావు, మల్లిపూడి సుబ్బారావు, దాసరి రత్నబాబు, కొడవటి గంగ రాజు, వార్డు మెంబర్ విజయ్, రవి, రేగులయ్య, బాలిన రాము, వెంకటేశ్వరరావు, వేముల రవి, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలు: గాంధీనగర్‌లో కేకు కట్ చేస్తున్న మహిళలు



పెరవలి: తీపర్రులో ముగ్గుల పోటీలు నిర్వహించిన దృశ్యం



గోపాలపురంలో పాలాభిషేకం చేస్తున్న టీడీపీ శ్రేణులు

మేరీమాతను దర్శించుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి



గౌరీపట్నంలో మేరీమాతను దర్శించుకున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు

దేవరపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చి ఏడాదిలో సుపరిపాలన అందించటం జరిగిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గౌరీపట్నంలో నిర్మలగిరి మేరీమాతను దర్శించుకుని పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్‌పీటర్ ఆశీస్సులు తీసుకున్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఆంద్రూ అనిల్, ఏఎంసీ చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు, టీడీపీ నాయకులు గన్నమని హరికృష్ణ, కొయ్యలమూడి చినబాబు, పెనుమత్స సుబ్బరాజు, బళ్లా సూర్య చక్రం, కొఠారు ధృవకాంత్, కొయ్యలమూడి సుధారాణి, కాకర్ల రామతులసి, తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తగూడెంలో కడియాలమ్మ జాతర మహోత్సవానికి ఎమ్మెల్యే హాజరై అమ్మవార్ని దర్శించుకున్నారు. ఈయన వెంట టీడీపీ నేతలు గన్నమని హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు, గ్రామస్థులు, తదితరులు ఉన్నారు.

పంట సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు అవసరం



వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో పాల్గొన్న కేవీకే అధికారులు

కొవ్వూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : పంట సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు అవసరమని కేవీకే విస్తరణాధికారి డాక్టర్ వి. దీప్తి రైతులకు సూచించారు. దొమ్మేరులో బుధవారం వికసిత్ కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ముందస్తు ఖరీఫ్ సాగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలో సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న అరటి, డ్రాగన్, చెరకు పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో చర్చలో పాల్గొని వారి సందేహాలను నివృత్తి చేశారు. డాక్టర్ దీప్తి మాట్లాడుతూ రైతులకు అరటి, మినుము, పెసర, వరిపంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతులు, భూసార పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేశారు. గేదెల పరిశోధనా సంస్థ అధిపతి డాక్టర్ కే. ఆనందరావు మాట్లాడుతూ పాడి రైతులకు పశుగ్రాస రకాల గురించి, పాల ఉత్పత్తి పెరగడానికి సూచనలు, గేదెల పెంపకంలో మెళకువలను వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఏ.గంగాధర్, సిబ్బంది మోహన్, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

● పరమేశ్వర బయోటెక్ మొక్కజొన్న ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ శివప్రసాద్



బస్టాండ్ వద్ద స్వచ్ఛభారత్ నిర్వహిస్తున్న కంపెనీ ఉద్యోగులు

దేవరపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిశుభ్రత ప్రతిఒక్కరి బాధ్యత అని పరమేశ్వర బయోటెక్ మొక్కజొన్న ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ శివప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక బస్టాండ్ వద్ద గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంపెనీ ఉద్యోగులు, సిబ్బంది స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా శివప్రసాద్ మాట్లాడుతూ పరమేశ్వర బయోటెక్ ఫ్యాక్టరీ ఆధ్వ ర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధ, గురువారాల్లో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. బుధవారం పరిసరాలను శుభ్రపరచటం, పిచ్చిమొక్కలు తొలగింపు చేపట్టామని, అలాగే గురువారం ప్రభుత్వ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం చేపడతామని వివరించారు. కార్యక్ర మంలో పరమేశ్వర బయోటెక్ ఫ్యాక్టరీ అకౌంట్స్ మేనేజర్ బాషా, ప్రొడక్షన్ మేనేజర్లు బాబూరావు, రవికుమార్, ప్రాథమిక వైద్య కేంద్రం వైద్యాధికారి సాంబశివరావు, ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలి : ఏఈ

తాళ్లపూడి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం మంజూరు చేసిన స్థలాల్లో సొంత ఇంటిని నిర్మించుకోవడానికి ప్రభుత్వం అదనపు నిధులు కూడా మంజూరు చేసిందని హౌసింగ్ ఏఈ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు మండలంలో 284 ఇళ్లు అసంపూర్తిగా ఉండగా, వాటిలో 151 ఇళ్లు పూర్తి కాగా, మిగిలినవి కూడా త్వరలో పూర్తి అవుతాయని తెలిపారు.

'యోగాతో మానసికోల్లాసం'



యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

కొవ్వూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఉల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర - 2025 కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆంధ్రగీర్వాణ విద్యాపీఠం ప్రాంగణంలోని సంస్కృత కళాశాలలో బుధవారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంఈవో రామకిషోర్, స్కూల్ అసిస్టెంట్ కే. సౌజన్య, మున్సిపల్ సిబ్బంది, వార్డు సెక్రటరీలు, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ వెన్నుపోటు దినం నిరసన ప్రదర్శనలు



నిరసన ప్రదర్శనలో మాజీ ఎమ్మెల్యే తలారి, నియోజకవర్గ పరిశీలకురాలు షర్మిలారెడ్డి

కొవ్వూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలను అమలుపర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, నియోజకవర్గ పరిశీలకులు ఎం. షర్మిలారెడ్డి అన్నారు.బుధవారం కొవ్వూరు మెరకవీధి వాటర్‌ట్యాంకు సెంటర్ నుంచి బస్టాండ్, విజయవిహార్ సెంటర్ల మీదుగా వైసీపీ నాయకులు ఆర్డీవో కార్యాలయం వరకు వెన్నుపోటు దినం నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆర్డీవో రాణీసుస్మితకు వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంటమణి రమేష్ బాబు, ముదునూరి నాగరాజు, చిట్టూరి అన్నవరం, పరిమి సోమరాజు, ఉప్పులూరి సూరిబాబు, ఏలూరి విజయలక్ష్మి, రుత్తల భాస్కరరావు, తోటరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణంలో వైసీపీ ఆధ్వర్యంలో బుధవారం వెన్నుపోటు నిరసన దినం సందర్భంగా పాదయాత్ర నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని పలువురు వైసీపీ నేతలు విమర్శిం చారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జి.శ్రీని వాస నాయుడు, డాక్టర్ గూడూరి శ్రీనివాస్, అయినీడి పల్లారావు, యలగాడ బాలరాజు, షేక్‌చాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



నిడదవోలులో పాదయాత్ర నిర్వహిస్తున్న వైసీపీ నేతలు, కార్యకర్తలు

'65 సంవత్సరాలు దాటినవారికి ఇంటి వద్దే రేషన్'

కొవ్వూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో 65 సంవత్సరాలు నిండిన వారికి ప్రతి నెలా ఇంటివద్దనే రేషన్ అందజేస్తున్నట్టు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. బుధవారం పట్టణంలో 66 సంవత్సరాల వృద్ధురాలు గారపాటి లక్ష్మికి ఇంటి వద్దనే ఆర్డీవో నిత్యవసరాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు 65 సంవత్సరాలు నిండిన వృద్ధులకు ప్రతినెలా 1వ తేదీ నుంచి 5వ తేదీలోపు నిత్యవసరాలను సచివాలయ సిబ్బంది పర్యవేక్షణలో రేషన్ డీలర్లు ఇంటివద్దనే అందజేస్తారన్నారు. ఆర్డీవో వెంట సీఎస్‌డీటీ సునీత, రేషన్ డీలర్లు , తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సరుకులు కాలనీ దగ్గరలోనే ఇవ్వాలి

తాళ్లపూడి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల వారికి కాలనీ ఇళ్లను మండలానికి దూరప్రాంతమైన సూర్యపేటలో మంజూరు చేశారు. అక్కడ వేర్వేరు గ్రామాల నుంచి వెళ్లి ఇళ్లు కట్టుకుని నివాసముంటున్నారు. కానీ రేషన్ కార్డులు మాత్రం వారి పాత గ్రామాలలోనే ఉన్నాయి. దీనివల్ల వారు రేషన్ తీసుకోవడానికి సొంత గ్రామా లకు వెళ్లాల్సి వస్తోందని వారంతా వాపో తున్నారు. అంతేకాకుండా దీనివల్ల ప్రతినెలా రేషన్ కోసం వెళ్లి రావడానికి సుమారు రూ. 200 అదనంగా ఖర్చు అవుతుందన్నారు. ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి కాలనీ వాసులకు రేషన్ సరుకులను తమ ప్రాంతంలోనే పంపిణీ చేయాలని వారంతా కోరుతున్నారు.

మహిళ గర్భాశయం నుంచి ..

నాలుగు కేజీల కణితి తొలగింపు

కొవ్వూరు, జూన్4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఓ మహిళకు శస్త్ర చికిత్స చేసి నాలుగు కేజీల కణితిని డాక్టర్లు తొలగించారు. పట్టణానికి చెందిన నల్లూరి శ్రీదేవి తీవ్ర రక్తస్రావంతో బాధపడుతోంది. బుధవారం ఆసుపత్రి ప్రసూతి వైద్యుల బృందం డాక్టర్ సునీత, భాగ్యలక్ష్మి పలురకాల వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం సీటీస్కాన్ పరీక్షల రిపోర్టులను పరిశీలించగా, గర్భాశయంలో నాలుగు కేజీల కణితి ఉన్నట్టు గుర్తించారు. దీంతో వైద్యులబృందం సుమారు గంటన్నరకు పైగా శ్రమించి కణితితో పాటు అండాశయాలను తొలగించారు. గైనకాలజిస్టు సునీత మాట్లాడుతూ శ్రీదేవికి వివాహమైనప్పటికీ గర్భం దాల్చలేదని, కణితితో చాలా ఇబ్బందులకు గురయ్యేదన్నారు. పదిరోజుల క్రితం ఆసుపత్రికి రాగా, పరీక్షలు నిర్వహించి రాజమహేంద్రవరంలో సీటీస్కాన్ చేయించుకునేందుకు వెళ్లగా, గర్భాశయంలో కణితి ఉన్నట్టు గుర్తించామన్నారు. దీంతో శస్త్రచికిత్సకు అవసరమైన మందులు వాడించడం జరిగిందన్నారు. శస్త్రచికిత్సకు డా. సునీత, డా. భాగ్యలక్ష్మీతో పాటు డా. లిఖిత, స్టాఫ్‌నర్సు కె. సీతారత్నం, ఓటీ అసిస్టెంట్ మౌనిక, సహాయకులు సీహెచ్ శ్రీనివాస్, ఎం. రాజు సహకరించారని గైనకాలజిస్టు సునీత తెలిపారు.

చెరువులో పడి మేకల కాపరి మృతి



జువ్వాల కుటుంబరావు మృతదేహం

నల్లజర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పోతవరం గ్రామానికి చెందిన మేకల కాపరి జువ్వాల కుటుంబరావు (55) బుధవారం పాత ఊరు చెరువులో పడి మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం కుటుంబ రావు చెరువు సమీపంలో మేకలను మేపుతుండగా ఫిట్స్ రావడంతో అందులో పడిపోయాడు. దీంతో ఎవరూ గమనించక పోవడంతో మృతిచెందాడు. సాయంత్రం చెరువు గట్టుపై నుంచి వస్తున్న రైతులకు మృతదేహం కనిపించడంతో గుర్తించి ఆయన కుటుంబ సభ్యులకు తెలియజేశారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీస్ కేసు నమోదు కాలేదు.

మధ్యాహ్న భోజన పథక కార్మికుల నిరసన



తాళ్లపూడిలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

తాళ్లపూడి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్మికులుగా పనిచేస్తున్న మహిళలు, సహాయకులు బుధవారం మలకపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమం వద్ద నిరసన వ్యక్తంచేశారు. వారు మాట్లాడుతూ మార్కెట్‌లో ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. అందువల్ల వంట కోసం గ్యాస్ బండలను ప్రభుత్వమే సరఫరా చేయాలని, జీతాలు పెంచాలని, వంట నిమిత్తం ప్రభుత్వం తమకు చెల్లించే డబ్బులు చాలా ఆలస్యంగా చెల్లిస్తుండడంతో వడ్డీల భారం భరించలేకుండా ఉన్నా మని, వెంటనే ఈ సమస్యలన్నింటినీ పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీ. వెంకటలక్ష్మి, కోదాటి భాగ్యవతి, కృష్ణకుమారి, ఎస్.గీత, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక నిర్వాహకులు పరిసరాల పరిశుభ్రతతో పాటు వంటశాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీపీ కేవీకే దుర్గారావు అన్నారు. దేవరపల్లిలో అంబటి సత్యనారాయణరావు జడ్పీ హైస్కూల్‌లో బుధవారం మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనికి జిల్లా విద్యాశాఖ కార్యాలయ ప్రతినిధి వెంకట్రాజు హాజరై శిక్షణ ఇచ్చారు. వంట చేసేటప్పుడు గ్యాస్ లీకైనప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎం.తిరుమలదాసు, కేఆర్ఎస్‌వీవీ అప్పారావు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక ర్యాంపు తనిఖీ

తాళ్లపూడి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): తాడిపూడి ఓపెన్ ఇసుక ర్యాంపును ఆర్డీవో రాణీ సుస్మిత బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఇసుక ఓపెన్ రీచ్‌ల్లో అక్టోబర్ 15 వరకు ఎటువంటి తవ్వకాలకు అనుమతులు లేవ న్నారు. కేవలం బోట్‌మెన్ సొసైటీ రీచ్‌లలో మాత్రమే పనిచేస్తాయన్నారు. అనంతరం ఆమె సిబ్బందితో మాట్లాడుతూ మూసివేసిన రీచ్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని, ర్యాంపులు గల ప్రదేశాలలో స్నానాలకు నిషేధం అన్న బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి తహశీల్దార్ మోహన భారతి, ఆర్ఐ రామకృష్ణ, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ఒక్కరోజు శిక్షణ



మాట్లాడుతున్న ఏడీ వెంకట్రాజు

తాళ్లపూడి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మలకపల్లి జడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజన కార్మికులకు బుధవారం ఒక్కరోజు శిక్షణ నిర్వహించారు.ఇందులో ఏడీ వెంకట్రాజు పాల్గొని మాట్లాడుతూ ఈనెల 12 నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో ప్రారంభించిన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విజయవంతం చేయడంలో కార్మికుల పాత్ర ఎంతో ముఖ్యమన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు బాలామణి, నెహ్రూజీలు, మలకపల్లి, అన్నదేవరపేట కాంప్లెక్స్ చైర్మన్లు శ్రీ వాసవి, రాధిక, మధ్యాహ్న భోజన కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

వినయ్‌ని అభినందించిన తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



వినయ్‌ని అభినందిస్తున్న తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

కొవ్వూరు, జూన్4 (ఆంధ్రజ్యోతి): కొవ్వూరు పట్టణానికి చెందిన ఐఏఎస్ 274 వ ర్యాంకర్ దొమ్మేటి వినయ్‌ని తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ బుధవారం అభినందించారు. ఇటీవల విడుదలైన యూపీఎస్సీ ఫలితాలలో వినయ్ సత్తా చాటాడు. దీంతో తెలంగాణ రాజ్‌భవన్‌లో వినయ్‌ని గవర్నర్ వర్మ శాలువా కప్పి, మెమెంటోతో సత్కరించారు.

టీడీపీ గ్రామ కమిటీల జాబితా సిద్ధం

నల్లజర్ల, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): టీడీపీ గ్రామ కమిటీల జాబితాను పూర్తిస్థాయిలో సిద్ధం చేసి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట రాజుకు బుధవారం అందించి, ఆయన అనుమతి పొందినట్టు టీడీపీ మండల ఎన్నికల కమిటీ సభ్యుడు, మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్, రాష్ట్ర నాయకులు షేక్ మీరా సాహెబ్, జాన్ విక్టర్ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కార్యకర్తలు, గ్రామ పార్టీ అధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు చెప్పారు. టీడీపీ గ్రామ కమిటీల తోపాటు అనుబంధ కమిటీలను ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

విద్యార్థులకు మెరుగైన ఆహారాన్ని అందించాలి

ఉండ్రాజవరం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన ఆహారాన్ని అందించాలని మధ్యాహ్న భోజన పథక జిల్లా పరిశీలకుడు డి. అచ్యుత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక కార్మికులకు ఇచ్చిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. విద్యార్థులకు రుచికరంగా, శుభ్రంగా భోజనం వండి పెట్టాలని సూచించారు. అలాగే భోజన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. విద్యార్థులకు నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా పాటించాలన్నారు. మండల రిసోర్స్‌పర్సన్ పి. వీరాంజనేయులు కార్మికులకు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం భోజన పథక కార్మికులకు వంటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు సక్సేనరాజు, శారదాజ్యోత్స్న ,తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి మండల టీడీపీ గ్రామ కమిటీలు ఇవే..

దేవరపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు మండలంలో టీడీపీ గ్రామ కమిటీలను ఏర్పాటు చేసినట్టు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు తెలిపారు. ఇందులో గౌరీపట్నం గ్రామ పంచాయతీ అధ్యక్షుడిగా కొఠారు ధృవకాంత్, ఉపాధ్యక్షుడిగా మామిడి కొండయ్య, ప్రధాన కార్యదర్శిగా కొర్లపాటి శివరా మకృష్ణ, త్యాజంపూడి పంచాయతీ అధ్యక్షుడిగా అక్కిన భూపతిరావు, ఉపాధ్యక్షుడిగా జెట్టి కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా ఆదిరెడ్డి రాజు, యర్నగూడెం పంచాయతీ అధ్యక్షుడిగా బొల్లిన విజయభాస్కర్, ఉపాధ్యక్షుడిగా కే.మహేశ్, ప్రధాన కార్యదర్శిగా వై.భీమేశ్, కురుకూరు పంచాయతీ అధ్యక్షుడిగా కొయ్యలమూడి గాంధీ, ఉపాధ్యక్షుడిగా హరిచంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా మద్దిపాటి సతీశ్, దుద్దుకూరు పంచాయతీ అధ్యక్షుడిగా కొయ్యలమూడి తాతారావు, ఉపాధ్యక్షుడిగా కడియం సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా మల్లిపూడి సుబ్బారావు, సంగాయిగూడెం పంచాయతీ అధ్యక్షుడిగా యద్దనపూడి రవీంద్ర, ఉపాధ్యక్షుడిగా ఆచంట జగత్ సత్యశేఖర్, ప్రధాన కార్యదర్శిగా ఉందుర్తి పవన్‌కల్యాణ్, పల్లంట్ల పంచాయతీ అధ్యక్షుడిగా ఆచటం శ్రీరామ్‌ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా తీగిరెడ్డి శ్రీను, ప్రధానకార్యదర్శిగా మర్రి కిశోర్‌కుమార్, రామన్నపాలెం పంచాయతీ అధ్యక్షుడిగా కాట్రగడ్డ రామ్మోహన్, ఉపాధ్యక్షుడిగా మంచిలి సూర్యచంద్రం, ప్రధాన కార్యదర్శిగా జవ్వాది వీరవెంకట దుర్గాప్రసాద్, బందపురం పంచాయతీ అధ్యక్షుడిగా ఎం.వెంకటరత్నం, ఉపాధ్యక్షుడిగా జగత వెంకటేశ్, ప్రధానకార్యదర్శిగా తిరుమల దుర్గాశ్రీనివాస్, చిన్నాయిగూడెం పంచాయతీ అధ్యక్షుడిగా పిన్నమనేని వీవీ సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా మార్నివివేకానంద,ప్రధాన కార్యదర్శిగా మేడిబోయిన రవికుమార్, లక్ష్మీపురం పంచాయతీ అధ్యక్షుడిగా నున్నా నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా మెంతిమి సురేశ్, ప్రధాన కార్యదర్శిగా దెయ్యాల మురళీ, దూమంతనగూడెం అధ్యక్షుడిగా యు.వీరవెంకట నరేంద్ర, యాదవోలు అధ్యక్షుడిగా యు. అంజిబాబు నియమితులయ్యారు.